ENTERED

స్నేహ

ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
నవంబర్ 21, 2010

Entered

40 రోజులు!
150 కోట్లు!!

2010 క్లయిమేక్స్?

హ్యాపీబర్త్‌డే

(2010 నవంబర్ 21 నుంచి 2010 నవంబర్ 27 వరకు)

ఎన్. నిఖిత
5సం॥, నవంబర్-21
సంతోష-వెంకటేష్
ఆరుట్ల-రంగారెడ్డి

లిఖిత
నవంబర్-23
యశోద-రమణ
అనంతపురం

పి. భావేష్
4సం॥,నవంబర్-23
లావణ్య-శేఖర్‌బాబు
మియాపూర్-హైదరాబాద్

ఎన్. శరణ్య
నవంబర్-21
వెంకటమ్మ-శశికాంత్
ఆదిలాబాద్

యన్.లానియా
1సం॥,నవంబర్-22
రమామణి-విజయ్
కర్నూలు



పి. పోతన్ ఆదిత్య
3సం॥,నవంబర్-2007
మానస-మధుసూదనరావు
నగరి-చిత్తూరు

ఎం.రాహుల్ సాయి
4సం॥, నవంబర్-21
సునీత-గుణ
రేణిగుంట-తిరుపతి

జి. సాత్విక్
1సం॥,నవంబర్-25
రత్న-రాజేంద్రబాబు
తిరుపతి-చిత్తూరు

బి. వరుణ్‌రెడ్డి
నవంబర్
అనిత-సురేంద్రరెడ్డి
పెనుమాక-గుంటూరు

ఆహ్వానం

మీ చిన్నారులకు కూడా ఇలా పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పాలని ఆశ పడుతున్నారా! అయితే ఆలస్యం ఎందుకండి! వెంటనే పెన్ను పేపర్ తీసుకోండి. దాని మీద మీ బాబు- పాప పేరు , పుట్టిన తేదీ, నెల, సంవత్సరం, ఊరు , తల్లిదండ్రుల వివరాలు రాసి కలర్ ఫోటో జతచేసి పోస్ట్ చేయండి. అయితే మీ చిన్నారి వివరాలను 15 రోజుల ముందుగానే మాకు అందేవిధంగా పంపగలరు.

మా చిరునామా
హ్యాపీ బర్త్‌డే, ప్రజాశక్తి ప్లాట్ నెం. 21/1, ఎం.హెచ్ భవన్
ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్-500 020
email- venkateshcartoon@gmail.com ph:9912354288

ENTERED

మనలో మాట

టీవీ పిల్లలు



ఓసారి ఓ పిల్లవాడికి పేరు తెలీని దేవుడు కనిపించాడు. 'ఏదైనా వరం కోరుకో బాలకా' అన్నాడు. పిల్లవాడు 'నాకు ఈ గది అంత పెద్ద టీవీ కావాలి గాడ్' అన్నాడు ఠక్కున.

దేవుడు ఆశ్చర్యపోతూ...'టీవీనా! ఎందుకు బాలకా! మరేదైనా వరం కోరుకో. టీవీలో ఏముంది?' అన్నాడు.

'ఓ గాడ్! టీవీలో ఏముందా! అన్నీ టీవీలోనే వున్నాయి. ఎన్ని కార్టూన్ సీరియళ్లో. వాటిని చూస్తుంటే స్కూలుకు వెళ్లాలనిపించదు. ఆడుకోవాలనిపించదు. ఫ్రెండ్సే అక్కర్లేదు. అసలు ఇంట్లోంచి బయటికే పోనక్కర్లేదు. రోజంతా టీవీ చూస్తూ నిద్రపోవచ్చు..' చెప్పాడు పిల్లవాడు సంతోషంగా.

'ఓ...బ్రహ్మ! ఎలాంటి పిల్లవాణ్ణి పుట్టించావు! ఆటలు, పాటలు, నేస్తాలు, పాఠశాలలు...ఏవీ వద్దంటున్న పిల్లలు కూడా వుంటారా!' అనుకొని ... 'అరే భడవా! అలా ఊరకే కళ్లప్పగించి చూడ్డానికి తప్ప ఆ టీవీ ఎందుకు పనికొస్తుందోయ్!' రెట్టిస్తూ అడిగాడు గాడ్.

'మా అమ్మానాన్నలు మమ్మల్ని కన్నా... పెంచేది మాత్రం టీవీనే...' సత్యం బోధించ మొదలెట్టాడు పిల్లాడు. 'మేం ఏం తినాలో, ఏం తాగాలో, ఏ బొమ్మలు కొనుక్కోవాలో, ఏ బట్టలు వేసుకోవాలో, ఏ సీజన్లో ఏ సబ్బు రుద్దుకోవాలో, ఏ పౌడర్ పూసుకోవాలో, ఏ మిల్క్‌పౌడర్ వాడాలో, ఏ బూట్లు..ఏ చెప్పులు వేసుకోవాలో... చెప్పేది టీవీనే. అందుకే టీవీ అడిగా....టీవీ ఇచ్చేసి రిమోట్ నా చేతిలో పెట్టేసి నువ్వెళ్లిపో గాడ్' తొందర పెట్టాడు బుడతడు.

♦♦♦

అదే గాడ్ అదే పిల్లవాడి తల్లికి కూడా కనిపించాడు. ఏదైనా మంచి వరం కోరుకోమన్నాడు. అదేంటోగానీ ఆ తల్లి కూడా అచ్చు ఆ పిల్లవాడిలాగే పేద్ద టీవీ ఇమ్మని అడిగింది. దేవుడికి నోట మాట రాలేదు. 'పుత్రుడికి తగ్గ మాత' అనుకొంటూ...'టీవీ ఎందుకు తల్లీ...మరేదైనా కోరుకో' అన్నాడు.

'ఇంతకు మించిన వరమేముంది స్వామీ. మంచి టీవీ వుంటే మా పిల్లవాడు బయటికి పోడు. టీవీ చూస్తూ ఏది పెట్టినా తినేస్తాడు. నేను మార్కెట్‌కెళ్లినా పిల్లవాడేమౌతాడోనన్న బెంగ లేదు. ఆటలు ఆడి కాళ్లూచేతులు విరగ్గొట్టుకుంటాడన్న దిగులు లేదు. టీవీకే అతుక్కొని కూర్చుంటాడు. అల్లరే చేయడు. నేను కూడా బోలెడన్ని సీరియళ్లు చూసేయొచ్చు... అన్నట్టు స్వామీ... జీడిపాకం సీరియల్ వచ్చే వేళ కూడా అయింది. టైమ్ వేస్ట్ చేయక బ్రహ్మాండమైన ఓ టీవీ ఇచ్చేసి వెళ్లిపో స్వామీ' అంది చిరాగ్గా.

♦♦♦

అదే గాడ్ ఓ డాక్టర్‌కి కనిపించి వరం కోరుకోమన్నాడు. అదేంటో ఆ డాక్టర్ కూడా తల్లీబిడ్డలు కోరినదే అడిగాడు. కాకపోతే కూసింత వెరైటీగా అడిగాడు.

'గాడ్! నేను బేసిగ్గా డాక్టర్ని. పదుగురి క్షేమం కోరుకునేవాణ్ణి. అందుకే టీవీల బిజినెస్ బాగుండేలా చూడు స్వామీ' అన్నాడు నవ్వుతూ.

'అదేంటయ్యా వైద్య శిఖామణీ! ఇంత పిచ్చి కోరిక కోరావు. ఓ వైపు పిల్లలు టీవీ మూలంగా ఆటపాటలకు దూరమై ... వ్యాయామం లేక స్థూలకాయులై ... వ్యాధులబారిన పడుతుంటే ... పరుగులెత్తాల్సిన వయసులో బందీలై బాల వృద్ధులౌతుంటే...టీవీల వ్యాపారం వెలిగిపోవాలని కోరుకుంటున్నావా!' అంటూ కోపంగా మాయమైపోయాడు గాడ్.

'నా ప్రాక్టీసు దినదిన ప్రవర్థమానమవ్వాలంటే టీవీ ఎంతవసరమో ఈ దేవుడికెలా చెప్పేది' అనుకుంటూ స్టెతస్కోప్‌తో నుదురు బాదుకొన్నాడు డాక్టర్.

★

ఈ సంచికలో....

టపా	...	2
వికాసం	...	3
కవిత్వమ్	...	6
ఈ పేజ్	...	7
సీరియల్	...	8
కొత్త పుస్తకాలు	...	11
చూద్దామా	...	12
చిన్న కథ	...	13
అట్టమీది కథ	...	14
రుచి	...	20
లైట్ తీస్కో...	...	21
బాలనేస్తాలు	...	22
మాటలకోట	...	24

ఇంకా...

స్ఫూర్తి ... 4

'సోషలిజం ఓనమాలు' దిద్దించిన పుస్తకం



తెల్సా ... 10

బదా బుక్కు

కథ ... 18

సమాధానం





చదవాల్సిన వ్యాసం

అమెరికా కౌబాయ్ ఎందుకొచ్చాడు? అన్న విషయాలు ఆకర్షించాయి. ఆనాడు నిక్సన్ ప్రధాన మంత్రిపై చేసిన వ్యాఖ్యలను మొదట సమర్థించుకొన్నా తరువాత ప్రజాభిప్రాయానికి తల ఒగ్గి నిజం చెప్పాడు. చదవవలసిన వ్యాసం.

ఆచార్య నూతి నారాయణరావు,
గడ్డిఅన్నారం.

ఒబామా రాక ఆసక్తికరం

అట్టమీదికథ...ఆసక్తికరంగా వుంది. ఈ సందర్భంగా 'భారత్ – అమెరికా సంబంధాలలో కొన్ని ఘట్టాలు..' ప్రస్తుతించటం బావుంది. ఈపేజ్ ద్వారా 'బ్లాగింగ్ బాతాఖానీ' తెలిసింది. క్యాన్సర్ సోకని జీవి 'షార్క్‌చేప' అని బాలనేస్తాలు 'ఔనా' ద్వారా గ్రహించాం. వెరైటీ 'టీ' కప్పులు చూస్తేనే తేనీరు రుచి చూసినంత ఆనందం కలిగింది. ఇరువైపులా సమంజసమైన ఆలోచన, సర్దుకుపోయే మనస్తత్వం ఉంటే ఎవరూ ఎవరికీ భారం కాదన్న 'చరిత' గారి 'వికాసం' అభిలషణీయంగా ఉంది. వియత్నాం వీరుడు ఎన్‌గుయెన్ వాన్‌ట్రాయ్ సీరియల్ ఉత్కంఠగా సాగుతోంది. 'బంధం' కథ రాసిన గోనుగుంట మురళీకృష్ణగారికి ధన్యవాదాలు. రకరకాల సూప్‌లు, వంటకాలతో...చవులూరింపజేశారు. 'వార్ అండ్ పీస్' స్ఫూర్తి ద్వారా మాకు మానవ జీవితపు సంపూర్ణ చిత్రం పరిచయమైంది. మనలో మాట 'చలి పులి' బావుంది. పేదోడికి చలికాలంలో అదనపు వణుకు తోడవుతుంది. కరువు వణుకుకు చలి తోడు!

నేమాన సుభాష్ చంద్రబోస్,
ఇలిసిపురం, శ్రీకాకుళం.

కడుపుబ్బ నవ్వించాయ్

31వ తేదీ ముఖ చిత్రం ఆనంద దీపావళి ఆకర్షణీయంగా వుంది. కుశలమా అంటూ సంస్కృతి సాంప్రదాయాల విలువలను పెంపొందించారు. శేఖర్‌గారి దీపావళి కార్టున్లు హాస్యాన్ని పండించాయి. ముఖ్యంగా యోగ విద్య కార్టూన్ కడుపుబ్బ నవ్వించింది. కె. సాహిల్ గారి దీపాలపండుగ వ్యాసం బావుంది. దీపావళి పండుగను ఇతర రాష్ట్రాలలో జరుపుకునే విధానం ఆకట్టుకొంది. 5 రోజుల పండుగ విషయాలు ఆహ్లాదాన్ని కల్గించాయి. విజయాల వేటలో రజనీ వ్యాసంలో మాకు తెలియని ఎన్నో విషయాలను తెలిపారు. ఆలస్యంగానైనా అందరికీ దీపావళి శుభాకాంక్షలు.

ఏసురాజా వెంకటరత్నం,
వేటపాలెం.

"భయం" నిజమే

అమ్మ నవలను అందరిలాగే నర్రా రాఘవరెడ్డి గారు చదివారు. అయితే ఆయన నవలలోని సారాంశాన్ని పార్టీని నడిపేందుకు స్ఫూర్తిగా తీసికొన్నారు. పత్రిక అవసరాన్ని, సాహిత్య అవసరాన్ని పార్టీ అవసరాలుగ గుర్తించారు. పార్టీ కార్యకర్తలకు చదువు లేకపోయినా మనస్ఫూర్తిగా పని చేయడమూ, వారిని గుర్తించడమూ అవసరమని తెలిపారు. జనం సినిమా గ్లామరుకు పడిపోయి సినీ నటులను ఎన్నుకోలేదు. అప్పటి పరిస్థితులకు అనుకూలంగా మాత్రమే యాక్టర్లను ఎన్నుకొన్నారు. కాంగ్రెసును తోసిపుచ్చి డి.యం.కె పార్టీ అధికారంలోకి రావడంతో ప్రజలకు కొంత నెమ్మది ఏర్పడ్డది. ఆ సమయంలో రజనీ స్టైయిల్‌గా నటించినందువల్ల తమిళనాడు ప్రజలు ఆదరించారు. అక్కడొక్కటి ఇక్కడొక్కటిగా జరిగే దొంగతనాలు, హత్యలను పేపర్లలో వేస్తున్నారు. ఒక్కోసారి అది సర్వసాధారణంగా జరుగుతున్నట్లు రాస్తున్నారు. కాస్తో–కూస్తో డబ్బు, బంగారం వున్న వారు తమకూ అలాగే జరుగుతుందనే భయంతో నెమ్మది లేకుండ అవస్థ పడతారు. వీళ్ల పనివారిని నమ్మరు. పేదవాళ్లను అస్సలు నమ్మరు. చివరికి తమ నీడను చూసుకొని కూడా భయపడతారు. ఇలాంటి దానికి తరతరాలుగ వస్తున్న ఆస్తులున్న పెద్దాయన పాత్రను స్వాతి తివారిగారు మనకు చూపించారు. అలాంటి మానసిక భయానికి మనం లోనవకుండ వుండడానికి ఈ కథ ఉపయోగ పడుతుంది.

ఇలిపిల్ల సూర్యనారాయణ,
భీమనవారిపేట, విజయవాడ.

అసలైన కుశలం

కుశలమా స్వచ్ఛమైన పలకరింపు. నిజమైన కుశలం బాగుంది. గోర్కీ 'అమ్మ' పుస్తకం అందరూ చదవాలి. రజనీ అడుగులు రాజకీయాలవైపుకు పోవు. చిరంజీవిలా భ్రష్ట రాజకీయాలు చేయడు. "కంప్యూటర్" వ్యవహారం బాగా చెప్పారు. వీలగిరి నీలికొండలు దర్శించాల్సిందే. హాని కలగని, దీపాలు వెలిగించాలి. జిలేబీ మంచి తీపి వంటకం. పెరుగులు, అన్నం ఘాటు అదిరింది. వాచిపోయే వాచ్‌లు మాకొద్దు. మా సెల్‌లోనే టైమ్ చూసుకుంటాం.

వాస్తు రామచంద్ర,
రాంజీనగర్, నెల్లూరు.

సూపుల సంగమం

సూప్‌ల రకాలు, చరిత్రలు



కమ్మగా ఉన్నాయి. టమేటో, నిమ్మ, కొత్తిమీర, మిక్స్‌డ్ వెజిటబుల్ సూపు, క్యారట్ సూపు అద్భుతం. కేరళ ప్రకృతి సంపదను అందరూ ఆస్వాదించాల్సిందే. "టీ" కప్పులు వెరైటీగా ఉన్నాయి.

వి.ఆర్.చంద్ర,
నెల్లూరు.

కూలీ బతుకును కళ్లకు కట్టారు

భూపతి వెంకటేశ్వర్లుగారు రష్యన్ నవల యుద్ధమూ శాంతి, బెంగాల్ నవల పథేర్ పాంచాలి చదివారు. ఆంధ్రప్రదేశ్‌లో కన్యాశుల్కం నాటకం చూశారు. దీనివల్ల ప్రపంచ ప్రజల గురించి తెలుసుకున్నారు. ప్రపంచ మానవ సమాజం రావాలని కోరుకొంటూ కార్మిక వర్గ పార్టీలో పనిచేస్తున్నారు. కె.చరితగారు పెద్ద విషయాన్నే ఎత్తుకొన్నారు. భర్తలేని ఆడమనిషి కూతురింట్లో నైనా... కోడలు ఇంట్లో నైనా....ఇమిడిపోగలదు. కాని భార్య పోయిన మగమనిషికి ఇంటిపనులు అలవాట్లు వుండవు. నేర్చుకోవడానికి నేర్చుకొనే వయస్సు కాదు. అయినప్పటికిని, పనిచేయడంలో ఆనందం వుందని గ్రహిస్తే పెద్దలు, పిల్లలకు భారం అవరు. బంధం కథను రోజువారి కూలీల జీవనాన్ని కళ్లకు కట్టే వర్ణనలతో మురళీకృష్ణగారు చిత్రీకరించారు.

ఎస్.ఎన్.
విజయవాడ. ★

"ఇదేంటి పోయిన నెల కరెంటు బిల్లు కట్టాం కదా! మళ్లీ అది కూడా ఈ నెలలో కలిపాడేంటి, గత సంవత్సరం ఇంటి పన్ను గడువు ఇంకా 15 రోజులుండనగానే కట్టేశాం. వీళ్లకు మతి లేదా ఏంటి?" అనే మాటలు మనం అప్పుడప్పుడూ వింటూనే ఉంటాం. అయితే అలాంటి సమయాల్లో అంతకముందు బిల్లు చెల్లించిన రసీదులుంటే ఏ గొడవా ఉండదు. పొరపాటున అది గనుక పోతే ఇంక ఆరోజు ఇంట్లో ఒక చిన్న సైజు తుఫాను వచ్చినట్లే.

కరెంటు బిల్లులు, వాటర్ బిల్లులు, ఫోన్ బిల్లులు, ఇంటిపన్ను, క్రెడిట్ కార్డుల వాయిదాలు వంటి వాటిలో టెక్నికల్ సమస్యలు రావడం సహజం. అనవసరంగా ఆయా ఆఫీసుల చుట్టూ తిరగాల్సిరావడం... డబ్బులు పోగొట్టుకోవడమే కాకుండా ఇంట్లో లేనిపోని గొడవలకు దారితీస్తుంది. మరి ఆ చిన్ని చిన్ని చిక్కులనుంచి బయటపడాలంటే...



రసీదులు భద్రం

అంతకుముందు కట్టిన బిల్లు రసీదులు భద్రంగా దాచిపెట్టుకుంటే ఇటువంటి సమస్యలు వచ్చినప్పుడు సులువుగా పరిష్కరించుకోవచ్చు. పాత రసీదులను చూపించడం వల్ల అది టెక్నికల్ లోపమని వారికి అర్థమౌతుంది.

ఇంత ముఖ్యమైన వాటిని ఎవరూ నిర్లక్ష్యం చేయరు. కాకపోతే గుర్తుగా ఒక దగ్గర వేటికవి పెట్టుకోవడం వల్ల సమయానికి కంగారు పడాల్సిన అవసరముండదు.

పొద్దున లేచిన దగ్గరి నుంచి డబ్బుతో అనేక వ్యవహారాలు నడుస్తుంటాయి. వాటికి సంబంధించిచ రసీదులను ఫైల్ చేసుకోవడం, వాటికి సంబంధించిన విషయాలను ఒక డైరీలో రాసుకోవడం ఈ రోజుల్లో ఎంతో అవసరం. ఎందుకంటే వాటితో ఎప్పటికైనా అవసరమే.

'కట్టేశాం కదా! ఇంకెందుకులే ఈ చెత్త' అనుకోకూడదు. అవే రేపు మనను అనవసరపు చికాకుల నుంచి గట్టెక్కిస్తాయి.

పిల్లల స్కూల్లోగానీ, కాలేజీలోగానీ ఫీజులు కట్టిన రసీదులు ఎప్పటికప్పుడు ఒక ఫైల్ చేసి ఉంచుకోవాలి. ఒకవేళ వారి దగ్గర మనం కట్టినట్లు ఉన్న రసీదులు మిస్సయినా కంగారు పడాల్సిన పనిలేదు.

ఎల్ఐసి పాలసీలకు సంబంధించిన కాగితాల కోసం ఒక ఫైల్‌ను ఏర్పాటు చేసుకోవాలి. ప్రతిసారీ ప్రీమియం చెల్లించనప్పుడు ఇచ్చే రసీదును దానిలో భద్రపరచుకోవాలి.

పోస్టాఫీసు రికవరింగు డిపాజిట్లు, చెల్లింపుల రసీదులను వేరుగా ఒక ఫైల్‌లో పెట్టుకోవాలి. అంతేకాదు వాటికి సంబంధించిన పుస్తకాన్ని జాగ్రత్తగా ఉంచాలి.

భీమా కంపెనీల బాండ్ పేపర్లని ఎక్కడపడితే అక్కడ పెడితే సమయానికి దొరక్క ఇబ్బంది పడాల్సివస్తుంది. అందుకే వాటిని జాగ్రత్తగా భద్రపరచుకోవాలి.

అలాగే బ్యాంకుకు సంబంధించిన కాగితాలను, రసీదులను ఒక కాలపరిమితి వరకు జాగ్రత్తగా ఒక ఫైల్‌లో అట్టిపెట్టుకోవాలి. పాస్‌బుక్‌ను నెల లేదా రెండు నెలలకొకసారి అప్‌డేట్ చేయించుకోవాలి. అవి అవసరానికి పనికి వస్తాయి.

పర్సనల్‌లోన్ గాని, హౌస్ లోన్ గానీ తీసుకుంటే వాటికి సంబంధించిన ప్రతినెలా కట్టే రసీదులను ఆ లోన్ పూర్తిగా తీరిపోయే వరకు దాచిపెట్టుకోవాలి.

చెక్, డిడిల ద్వారా చెల్లింపులు చేసేప్పుడు వాటి నంబర్లను తారీఖులను డైరీలో జాగ్రత్తగా రాసిపెట్టుకోవాలి.

ఫైనాన్స్ కంపెనీలోగానీ ఇతర చోట్ల కానీ చిట్టీలు కడుతుంటే వాటికి సంబంధించిన రసీదును భద్రపరచుకోవాలి. పాస్‌బుక్‌లో చెల్లింపులను రాస్తున్నప్పటికీ చిట్టీ పూర్తయి డబ్బులు చేతికి వచ్చే వరకు రసీదులు కూడ దాచిపెట్టుకోవడం మంచిది.

ఇంకా టీవీ, డివిడి, ఫ్రిజ్, కూలర్, వాషింగ్ మెషీన్ వంటి వస్తువులు కొన్నప్పుడు రసీదులను తప్పకుండా తీసుకొని భద్రపరచాలి. వాటితో పాటు గ్యారెంటీ కార్డులను జాగ్రత్తగా దాచిపెట్టాలి. గ్యారెంటీ ఇచ్చిన గడువులోపు ఏదైనా రిపేరు వస్తే వాటిని చూపించి ఖర్చు లేకుండా రిపేరు చేయించుకోవచ్చు.

రుణవాయిదాలు, చిట్టీ చెల్లింపులు, ఎల్ఐసి ప్రీమియంలు, క్రెడిట్ కార్డుల చెల్లింపులు, ఫోస్టాఫీసులో రికవరింగు డిపాజిట్లు వంటి వాటి గడువు తేదీలను డైరీలో గానీ, ఒక ఫైల్‌లో గానీ రాసిపెట్టుకోవాలి. లేదంటే అనవసరంగా ఫైన్ కట్టాల్సి వస్తుంది.

ఇంటికి కావాల్సిన వస్తువులు కొన్నప్పుడు బిల్లులు తప్పకుండా తీసుకోవాలి. బట్టల షాపులో కూడా తప్పకుండా బిల్లులు తీసుకోవాలి. మనం తీసుకున్న వస్తువులకు, బట్టలకు నష్టం కలిగినప్పుడు పరిహారం కోసం డిమాండ్ చేయవచ్చు. వారు స్పందించకపోతే వినియోగదారుల కోర్టులను ఆశ్రయించవచ్చు. అందుకోసం మనం కొన్న వస్తువుల రసీదులు అవసరం.

ఆ రసీదులన్నీ ఒక్కో ఫైలులో పెట్టుకోవాలి. ఆయా రసీదుల ఫైల్ మీద వాటి పేరు రాసిపెట్టుకుంటే సమయానికి సులభంగా దొరుకుతాయి. ఇలా చేయడం మొదట్లో కాస్త కష్టమనిపించినా పోనుపోను ఇదే సులభమనిపిస్తుంది.

-మైత్రి

స్ఫూర్తి

పి.అజయ్‌కుమార్,
కార్యదర్శి,
సి.ఐ.టి.యు ఎ.పి.కమిటీ.

'సోషలిజం ఓనమాలు' ఒద్దించిన పుస్తకం

సోషలిజానికి సంబంధించిన కొన్ని ముఖ్యమైన ప్రశ్నలకు ఇచ్చిన సమాధానాలు ఈ నాటికీ మనకు ఉపయోగం. లాభాలు లేకుండా సోషలిజంలో ఎందుకు పని చేస్తారన్న ప్రశ్నకు పెట్టుబడిదారీ వ్యవస్థలో లాభాలు వచ్చేవాళ్ళు పని చేయరని, పనిచేసే వాళ్ళకు కూలి మాత్రమే వస్తుందని రచయిత తిప్పికొట్టారు.

సోషలిజం అంటే వ్యక్తుల ఆస్తులను స్వాధీనం చేసుకోవటమేనా అన్న ప్రశ్నకు రచయిత స్పష్టమయిన సమాధానం ఇచ్చారు. మన రోజువారీ పనిలో ఉపయోగ పడుతుంది.

నేను బ్యాంక్‌లో పని చేసే కాలంలో ఒకసారి మేనేజరును ఉద్యమనిధి అడిగాను. 'ఏంటయ్యా మీరు సోషలిజం అంటారు. సోషలిజం వస్తే ఏం చేస్తారు? అందరికీ పంచుతాం అంటారు. ఈ బీరువా ఉంది. దీన్ని ముక్కలు చేసి పంచుతారా?' అని అడిగారు. వ్యక్తిగత ఆస్తిని కూడా పంచుతారా? నువ్వు అడిగావు గాబట్టి ఇస్తున్నానని" 5రూ.లు చందా రాశాడు. ఇది 30 సంవత్సరాల క్రితం జరిగిన సంఘటన.

"తన అనుభవానికి, ఉపయోగానికి అదనంగా వ్యక్తిగత ఆస్తిని సోషలిస్టు వ్యవస్థలో కలిగి వుండవచ్చు. కాని ఇతరులను పీడించటానికి, దోపిడీని చేయటానికి ఉపయోగపడే ఆస్తి మాత్రం సోషలిస్టు వ్యవస్థలో పొందటానికి వీలు లేదంటూ" సమాధానం చెప్పారు.

"సోషలిజం ఓనమాలు" పుస్తకం నాకు సోషలిస్టు సిద్ధాంత ప్రాథమిక పరిజ్ఞానాన్ని అందించింది. ఈ పుస్తకం అందించిన స్ఫూర్తితో ఉద్యమంలో మార్క్సిస్టు సిద్ధాంతానికి సంబంధించిన పలు పుస్తకాలు చదివాను.

వామపక్ష రాజకీయాల పట్ల చిన్నప్పటి నుండి అభిమానం వుంది. కానీ ఆ సాహిత్యం చదవటం మొదలు పెట్టింది మాత్రం కాస్త వయసు పెరిగాకే. "సోషలిజం-ఓనమాలు" చదివింది 1979-80లో. అంతకుముందు చాలా తేలికగా ఉండే నవలలు చదివాను. 'ఓల్గా సే గంగా, విస్మృత యాత్రికుడు, ఏడుతరాలు, స్పార్టకస్...' వంటి అభ్యుదయ నవలలు...శ్రీశ్రీ రచనలు 'మహాప్రస్థానం, ఖడ్గ సృష్టి...' చదివాను.

బ్యాంకులో చేరిన సంవత్సరం తర్వాత నాకు వామపక్ష ఉద్యమంతో ప్రత్యక్ష సంబంధం ఏర్పడింది. విద్యార్థి ఉద్యమంలో కూడా నేను పాల్గొనలేదు. చిన్నప్పటి నుండి వామపక్ష రాజకీయాలకు అభిమానిగా ఉండటానికి కారణం మా కుటుంబ నేపథ్యం. మా పెదనాన్నగారి అబ్బాయి కమ్యూనిస్టు ఉద్యమంలో, తెలంగాణ సాయుధ పోరాటంలో



పాల్గొన్నారు. ఆయన ముద్ర మా కుటుంబం మీద వుంది. మా స్వగ్రామం కృష్ణా జిల్లా జగ్గయ్యపేట నియోజకవర్గంలో వుండేది. ఆ తర్వాత కొత్తగా ఏర్పాటు చేసిన నందిగామ నియోజక వర్గంలోకి వచ్చింది. మా అమ్మానాన్న ఎప్పుడూ కమ్యూనిస్టు అభ్యర్థులు లేదా కమ్యూనిస్టులు బలపర్చిన అభ్యర్థులకే ఓట్లు వేసేవారు. కాంగ్రెస్‌వాళ్లు ఇంటికొచ్చి అడిగినా వేయడానికి నిరాకరించే వారు. ఎన్నికల సమయంలో ఒకటి రెండు నెలలపాటు మా ఇంటి చుట్టూ వుండే కుటుంబాలు మాతో మాట్లాడేవి కావు. రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామంలో ఓటు వేయడానికి మా అమ్మను తీసుకెళ్లడానికి కమ్యూనిస్టుల బండి వచ్చేది. మా ఇంటి వెనుక బజారులో రావి చెట్టు మీద ముందుగా కమ్యూనిస్టు, కాంగ్రెసు, స్వతంత్ర పార్టీల జెండాలు ఎగరవేసేవారు. ఎన్నికల్లో ఎవరు గెలిస్తే వారి జెండా ఉంచి మిగతా జెండాలు దించేవారు. బహుశా నాకు గుర్తున్నంత వరకు ఎర్ర జెండానే ఎక్కువ సార్లు (1960వ దశకంలో) ఎగిరింది. మా ఊరు తెలంగాణ సరిహద్దులో ఉండడంతో పోరాట కాలంలో సుందరయ్య గారు వచ్చి గడ్డివాముల్లో దాక్కునే వారని చెప్పేవారు. లెఫ్ట్‌పార్టీ రైట్ పార్టీల మధ్య విబేధాలపై కూడా చర్చలు జరిగేవి. మా మేనమామ ఒకాయన రైట్‌పార్టీలో ఉండేవారు. ఆయనకు, మా అన్నయ్యకు మధ్య జరిగే వాదోపవాదాలు వినేవారం. మా మేనమామ రైట్‌పార్టీ నుండి అనేక పార్టీల్లోకి మారారు.

ఈ నేపథ్యంలో బ్యాంకు ఉద్యోగిగా చేరిన తర్వాత మొదటి నుంచి యూనియన్‌లో చురుకుగా పని చేశాను. నేను చేరిన బ్యాంకులో వామపక్ష రాజకీయాల్లో ఉన్నవారే

నాయకులుగా ఉన్నారు. దీంతో ఆ రాజకీయాలతో మరింత అనుబంధం పెరిగింది. ఈ నేపథ్యంలోనే "సోషలిజం ఓనమాలు" పుస్తకం చదివాను. ఈ పుస్తకంతో నేను మొదలు పెట్టటానికి అది చాలా సులువుగా ఉండటమే కారణం. ఈ పుస్తకం స్ఫూర్తితో ఇతర మార్క్సిస్టు భావాలకు సంబంధించిన కొన్ని పుస్తకాలు కూడా చదవగలిగాను.

ఇప్పటికీ నేను పెద్ద చదువరిని కాకపోయినా పత్రికలు, మ్యాగజైన్స్ మాత్రం ఇష్టంగా చదువుతాను. కొన్ని కంపల్షన్స్ (మంచివి) వల్ల మార్క్సిస్టు సాహిత్యం చదువుతున్నా. సమాజాన్ని అర్థం చేసుకోడానికి, రోజువారి ట్రేడ్ యూనియన్ జీవితానికి ఈ అధ్యయనం బాగా ఉపయోగపడుతున్నది.

ఇక పుస్తకం విషయానికి వస్తే...మొదటి రెండు మూడు వాక్యాలతోనే పుస్తకం నన్ను ఆకట్టుకుంది. సోషలిస్టు సిద్ధాంతం లోతుపాతులు తెలియని కాలంలో నేను చదివిన మొదటి పుస్తకం "సోషలిజం ఓనమాలు". మార్క్సిస్టు సిద్ధాంత ప్రాథమిక పరిజ్ఞానాన్ని అందించే గ్రంథాలలో ఇది ఒకటి. అమెరికన్ రచయిత, అభ్యుదయ విద్యా ప్రోత్సాహకుడు లియో హ్యూబర్‌మన్ 1967లో దీన్ని రాశారు. "ఎబిసి ఆఫ్ సోషలిజం" ఇంగ్లీషు పుస్తకానికి ఇది తెలుగు అనువాదం. కొరటాల సత్యనారాయణ గారు తెలుగు అనువాదం చేశారు. లియో హ్యూబర్‌మన్ రచనలన్నీ చాలా సులభంగా అర్థమవుతాయి. ఈ పుస్తకం కూడా ఆ కోవలోనిదే. లియో హ్యూబర్‌మన్ కార్మికుడిగా జీవితాన్ని ప్రారంభించిన వ్యక్తి. స్వయంగా పెట్టుబడిదారీ దోపిడీకి గురయ్యారు. ఉన్నత విద్యను అభ్యసించడానికి, వర్కర్స్ స్కూల్స్‌ను నడపటానికి ప్రాధాన్యత ఇచ్చారు. 1949లో పాల్ స్వీజీతో కలిసి 'మంత్లీ రివ్యూ' మ్యాగజైన్‌ను ప్రారంభించారు.

"ప్రజలు పేదవారు లేక భాగ్యవంతులు, బలము గలవారు లేక బలహీనులు, నల్లవారు లేక తెల్లవారు-ఎవరైనప్పటికీ జీవించటానికి ఉత్పత్తి, పంపిణీ అవసరం. అమెరికాలో నేడున్న ఉత్పత్తి- పంపిణీ విధానములనే పెట్టుబడిదారీ విధానం అంటారు"తో మొదలు పెట్టి-

"ఉత్పత్తికి సాధనాలు, శ్రామికులు అవసరం. ఉత్పత్తి సాధనాలు పెట్టుబడిదారుల చేతుల్లో ఉంటాయి. వారు శ్రమించకుండానే జీవించవచ్చు. శ్రామిక వర్గంలో నీవు ఒకడివయితే శ్రమించకుండా జీవించలేవు. శ్రామికునకు ఎంత తక్కువ కూలి ఇస్తే యజమానికి అంత ఎక్కువ లాభం. పెట్టుబడిదార్ల ప్రయోజనాలు శ్రామిక ప్రయోజనాలకు విరుద్ధం. ఒక వర్గానికి ఏది లాభామో, మరో వర్గానికి అది నష్టం" అంటూ రచయిత పెట్టుబడిదారీ విధానాన్ని నగ్నంగా చిత్రించారు. ఇది వర్గ సమాజమని, వర్గ పోరాటం తథ్యమని అప్పుడు అర్థమయింది.

మేము కాలేజీలో చదువుకున్న పుస్తకాల్లో కొన్న విలువ -అమ్మకపు విలువ= లాభం. అమ్మకం ద్వారా వచ్చిన ఆదాయం నుంచి భూమి మీద కౌలు, పెట్టుబడి మీద వడ్డీ, యంత్రాల అరుగుదల, ముడి పదార్థాల ఖర్చు, కార్మికుల వేతనాలు తీసివేస్తే లాభం వస్తుందని చూపించారు. మా చేత అటువంటి లెక్కలు చేయించారు.

కానీ వాస్తవంగా పెట్టుబడిదారుడికి లాభం కార్మికుడు సృష్టించిన అదనపు విలువ నుండే వస్తుందని ఈ పుస్తకం ద్వారా నేను ప్రాథమికంగా తెలుసుకోగలిగాను. "సరకుల మారకంలో లాభాలు రావు. ఉత్పత్తి క్రమంలోనే వస్తాయి. కార్మికుడు తన శ్రమశక్తిని ఉపయోగించి ముడి పదార్థాన్ని కొత్త వస్తువుగా తయారు చేస్తాడు. కార్మికుడు సృష్టించిన అదనపు విలువ మరియు కార్మికుడు పొందిన వేతనం మధ్య ఉన్న తేడానే పెట్టుబడిదారుడి లాభం" తేలిక భాషలో లాభం ఎలా వస్తుందో రచయిత చెప్పారు. పెట్టుబడి, యంత్రాలు, ముడి పదార్థాలు ఇవన్నీ పోగుపడిన శ్రమ. అవన్నీ కార్మికులు సృష్టించినవే. భూమి ఒకప్పుడు ఎవరి సొత్తూ కాదు.

డబ్బుని తలకింద పెట్టుకొని నిద్రపోతే అది పెరగదు. దానిని పెట్టుబడిగా వినియోగించినప్పుడే పెరుగుతుంది. శ్రమశక్తిని, ఉత్పత్తి సాధనాలను కొని వాటిని ఉపయోగంలో పెట్టిన ఫలితంగా వచ్చిన నూతన విలువలో ఒక భాగాన్ని పెట్టుబడిదారుడు లాభంగా పొందుతాడు.

యంత్రాలను వినియోగించటం, తక్కువ కార్మికులతో ఎక్కువ శ్రమ చేయించి పెట్టుబడులను వృద్ధి చేయటం పెట్టుబడిదారీ వ్యవస్థ లక్షణం. "అత్యధిక లాభాల కోసం పెట్టుబడిదారీ కార్మికులకు వీలయినంత తక్కువ కూలి ఇవ్వాలి. పెట్టుబడిదారుని ఉత్పత్తులు అమ్ముకోవాలంటే కార్మికులకు వీలయినంత కొనుగోలు శక్తి ఎక్కువ వుండాలి. ఇది పరిష్కరించటానికి వీలు లేని వైరుధ్యం. పెట్టుబడిదారీ చట్టంలో దీనికి పరిష్కారం లేదు. మనకు సంక్షోభాలు తప్పవు!!" అందువలనే ప్రపంచంలో వరుసగా ఆర్థిక సంక్షోభాలు సంభవిస్తున్నాయి.

అన్ని వ్యవస్థల వలెనే పెట్టుబడిదారీ వ్యవస్థ కూడా అంతకు ముందున్న వ్యవస్థ నుండి పుట్టింది. పెరిగింది. మిగిలిన వ్యవస్థలు కాల గర్భంలో కలిసి పోయినట్లే, యీ పెట్టుబడిదారీ వ్యవస్థ కూడా మరో వ్యవస్థకు స్థానమిచ్చి నాశనమవుతుందనే మార్క్సిస్టు శాస్త్రీయ అవగాహనను రచయిత ప్రస్తావించారు. శ్రామిక వర్గం తన బానిస శృంఖలాలను తెంపుకోగలదని, కొత్త సమాజాన్ని నిర్మించగలదనీ మార్క్సిస్టు విశ్వాసాన్ని పొందుపర్చారు.

పెట్టుబడిదారీ విధానంలో ఉన్న అసమర్థతను, హేతువాద విరుద్ధతను, అన్యాయాన్నే గాకుండా సోషలిజంలో ఉన్న గొప్పతనాన్ని రచయిత తెలియజేశారు.

అప్పటి సోవియట్ రష్యాలో ప్రణాళిక కింది నుంచి పైదాక చర్చించిన తర్వాతనే పూర్తి రూపం తీసుకుని అమలులోకి వచ్చేదని సోషలిస్టు ప్రణాళిక విశిష్టతను తెలిపారు. లాభాలు-గాకుండా ప్రజల అవసరాలను తీర్చటమే సోషలిస్టు ప్రణాళిక లక్ష్యం. సోషలిస్టు ప్రణాళికాయుత ఆర్థిక విధానం వల్లనే 1929 ప్రపంచ సంక్షోభం రష్యాను తాకలేక పోవటంలో కూడా సోషలిజం విశిష్టత వేగపడుతుంది.

సోషలిజానికి సంబంధించిన కొన్ని ముఖ్యమైన ప్రశ్నలకు ఇచ్చిన సమాధానాలు ఈ నాటికీ మనకు ఉపయోగం. లాభాలు లేకుండా సోషలిజంలో ఎందుకు పని చేస్తారన్న ప్రశ్నకు పెట్టుబడిదారీ వ్యవస్థలో లాభాలు వచ్చేవాళ్ళు పని చేయరని, పనిచేసే వాళ్ళకు కూలి మాత్రమే వస్తుందని రచయిత తిప్పికొట్టారు.

సోషలిజం అంటే వ్యక్తుల ఆస్తులను స్వాధీనం చేసుకోవటమేనా అన్న ప్రశ్నకు రచయిత స్పష్టమయిన సమాధానం ఇచ్చారు. మన రోజువారీ పనిలో ఉపయోగ పడుతుంది.

నేను బ్యాంక్‌లో పని చేసే కాలంలో ఒకసారి మేనేజరును ఉద్యమనిధి అడిగాను. 'ఏంటయ్యా మీరు సోషలిజం అంటారు. సోషలిజం వస్తే ఏం చేస్తారు? అందరికీ పంచుతాం అంటారు. ఈ బీరువా ఉంది. దీన్ని ముక్కలు చేసి పంచుతారా?' అని అడిగారు. వ్యక్తిగత ఆస్తిని కూడా పంచుతారా? నువ్వు అడిగావు గాబట్టి ఇస్తున్నానని" 5రూ.లు చందా రాశాడు. ఇది 30 సంవత్సరాల క్రితం జరిగిన సంఘటన.

"తన అనుభవానికి, ఉపయోగానికి అదనంగా వ్యక్తిగత ఆస్తిని సోషలిస్టు వ్యవస్థలో కలిగి వుండవచ్చు. కాని యితరులను పీడించటానికి, దోపిడీని చేయటానికి ఉపయోగపడే ఆస్తి మాత్రం సోషలిస్టు వ్యవస్థలో పొందటానికి వీలు లేదంటూ" సమాధానం చెప్పారు.

"సోషలిజం ఓనమాలు" పుస్తకం నాకు సోషలిస్టు సిద్ధాంత ప్రాథమిక పరిజ్ఞానాన్ని అందించింది. ఈ పుస్తకం అందించిన స్ఫూర్తితో ఉద్యమంలో మార్క్సిస్టు సిద్ధాంతానికి సంబంధించిన పలు పుస్తకాలు చదివాను.

★

అగాధాల అంచుల్లో...

వచ్చేపొయ్యే వాహనాలు పలకరించుకుంటూ
ఎదురెదురు దారుల్లో పరుగులు తీస్తున్నాయి
రోడ్లమధ్య పూలుజల్లి స్వాగతిస్తున్నాయి
మొజాయిక్ ఫ్లోరింగును మరపించిన రోడ్లు
నునుసిగ్గుల యవ్వనంతో మిసమిసలాడుతున్నాయి
అందమైన చీరకు మరింత శోభనిచ్చిన అంచులా
నల్లరోడ్లను తెల్లరంచులు మెరిపిస్తున్నాయి
లైసెన్సులు లేని చేతులు స్టీరింగులపై నాట్యం చేస్తున్నాయి
కాలుష్య పెనుభూతం కోరలు చాచివుంది
ప్రశ్నించిన వాడిపై బలప్రయోగాలు
నాగరికత కరువైన అభివృద్ధి పురోగోభివృద్ధికాదు!
పల్లెలు పొట్టిపోయి నగరాలు పొడుగులయ్యాయి
హర్మ్యాలు ఆకాశాన్ని అంటుతున్నాయి
రోజుకో పేట ఉద్భవం చూసి
విభ్రాంత్యాశ్చర్యంలో సూర్యుడు
అత్యాధునిక పరికరాలు జీవితాన్ని సుఖమయం చేస్తున్నాయి
అభివృద్ధి గ్రాఫు గరిష్టం తాకింది
వీధి వీధికి వైషమ్యాలు పెరిగాయి
హింస అశ్వమేధ యాగం చేస్తూ వుంది
కులాలు మతాలు దొంగదాడులు చేస్తున్నాయి
కళ్లు మూస్తే కాలుడు వస్తాడని కునుకులు మానేశాయి

నాగరికత మరుగైన పురోభివృద్ధి అభివృద్ధి కాదు!
ఖరీఫ్ రబీ పంటలు కదం తొక్కుతున్నాయి
పంటల్లో అంతర్ పంటలు వాణిజ్యపంటలు
కర్షకులే సాంకేతిక నిపుణులై
దిగుబడులు ద్విగుణీకృతమయ్యాయి
అతివృష్టి అనావృష్టి ఆనవాయితీగా వెంబడించిన
మార్కెట్ మాయాజాలం మోసగించినా
చెదరని బెదరని ధీశాలులు హాలికులు
తోక భూముల్ని తడవనివ్వని
తలగడ భూముల దుశ్చర్యలు
ఎండిన పంటగుండెల్లో ఆరని మంటలు
తలలు తెగి అరుణం దాల్చిన పంట కాల్వలు
నాగరికత కరువైన అభివృద్ధి అభివృద్ధికాదు!
ఇప్పుడు నాగరికతను గూర్చి ముచ్చటిస్తున్నాను
పాతిపెట్టిన నాగరికతకై తవ్వకం సాగిస్తున్నాను!

- అడిగోపుల వెంకటరత్నమ్

కవిత్వమ్

గజిబిజి

- మొయిద శ్రీనివాసరావు

చేతి నిండా పని కల్పించడు
కూర్చుని తింటే
కొండలు కరిగిపోతాయంటాడు
ఒక్కడుగు ముందుకేయనీడు
అదృష్టం ఒకసారే
తలుపు తడుతుందంటాడు
తిండిలేక..ఆకలితో అలమటిస్తే
ఉపవాస ధర్మాన్ని ఉపదేశిస్తాడు
కంటినిండా కునుకు తీయనీడు
పగటి నిద్ర పనికి చేటంటాడు
నలుగురిలో మాట్లాడనీడు
మౌనం అర్ధాంగీకారమంటాడు
ఒక చెవితో విని
వేరొక చెవితో వదిలేయమంటాడు
మిన్నకుండిపోతే మట్టిబుర్ర వంటాడు
మనసు పెట్టి ఆలోచించనీడు
ఒక్క ఐడియా జీవితాన్ని మార్చేస్తుందంటాడు
అయిదు వేళ్లను పిడికిలిగా బిగించొద్దంటాడు
ముక్కు మూసుకు తపస్సు చేయమంటాడు
కంటిలోనికి ఎర్రని జీర రానీయ వద్దంటాడు
కడుపు కాలుతుంటే.........
కన్నీళ్ళొచ్చేలా నవ్వమంటాడు
వీడెవడండీ బాబు.......!?

గురివింద గురువులకు గుణపాఠం చెప్పేదెవరు?

వారు...గురుబ్రహ్మలు!
అక్షరాయుధాల్ని చేబూని
అజ్ఞానాంధకారాన్ని పారద్రోలే
చైతన్య దీపికలు
తరగతి గదుల్లో వికసించే
పసితనపు పరిమళాన్ని ప్రపంచానికి వెదజల్లే
వాహికలు!
ఓనమాల్ని దిద్దించే చేతులతోనే
బతుకుబాటకు ఆనవాలు చూపే పథ నిర్దేశకులు
మరి! వీరూ గురువులే...
అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని
పసితనంలోనూ కామాన్ని వెదికే అపర కీచకులు
గురుస్థానాన్ని కళంకపరచే లఘువులు



దండం పెట్టించుకోవాల్సిన చేతులే
దయ మరచి దండిస్తుంటే...
ప్రేమతత్వాన్ని బోధించాల్సిన ఆ నోరే
ప్రేమ పాఠాలకు తెర లేపుతుంటే
వివేకం నేర్పాల్సిన చోటే
వెకిలి చేష్టలతో వేదన కలిగిస్తుంటే
బంగారు బాల్యానికి భరోసా ఇచ్చేదెవరు?
ఈ గురివింద గురువులకు గుణపాఠం చెప్పేదెవరు...?
ఈ విషపురుగులాడే వికృతకేళిలో
మొత్తం వ్యవస్థే అభాసుపాలయ్యే అవస్థెందుకు?
దొడ్డ గురువుల ముసుగులో దొడ్డిదారిన నడిచే
ఈ మాస్టార్లను మట్టి కరిపించేదెవరు?

- ఇల్లి ప్రసన్నలక్ష్మి

ఎం.ఎస్ ఆఫీస్‌కు ధీటుగా ఓపెన్ ఆఫీస్



కంప్యూటర్‌ను ఉపయోగించే ప్రతి ఒక్కరూ ఏదో ఒక ఆఫీస్ సూట్‌ను ఉపయోగిస్తూనే వుంటారు. వర్డ్ ఫైల్స్ దగ్గర నుండి డేటా బేస్ తయారీ వరకు అనేక రకాల పనులకు సంబంధిత సాఫ్ట్‌వేర్స్ అందుబాటులో వున్నాయి. ఆఫీస్ సూట్ అనగానే ఎక్కువమంది ఠక్కున చెప్పేది మైక్రోసాఫ్ట్ ఆఫీస్ (ఎం.ఎస్.ఆఫీస్) గురించే. కానీ మైక్రోసాఫ్ట్ ఆఫీస్ సూట్‌ను తలదన్నేరీతిలో ఈమధ్యకాలంలో అత్యంత ప్రాచుర్యంలోకి వచ్చిన ఆఫీస్ సూట్ 'ఓపెన్ ఆఫీస్'. మైక్రో సాఫ్ట్ ఆఫీస్‌లో కూడా లేనటువంటి అద్భుతమైన ఫీచర్లతో మైక్రోసాఫ్ట్‌కు ధీటైన సవాల్ విసురుతోంది ఓపెన్ ఆఫీస్. ఆ వివరాలు...

ఆఫీసు అవసరాలకు వాడే సాఫ్ట్‌వేర్‌ని ఆఫీస్ సూట్ అంటారు. ఒక సాధారణ ఆఫీస్ సూట్‌లో వ్యాసాలు, ప్రజెంటేషన్లు, కంపెనీ ఖాతాలు, డేటా బేస్ వంటి అనేక పనులు నిర్వహించవచ్చు. అన్ని ఆఫీస్ సూట్లలోనూ ఎక్కువగా వాడే మైక్రోసాఫ్ట్ ఆఫీస్‌లో వ్యాసాలు రాయటానికి వాడే సాఫ్ట్‌వేర్‌ని మైక్రోసాఫ్ట్ వర్డ్ అంటారు. మైక్రోసాఫ్ట్‌వర్డ్‌లో ఒక వ్యాసాన్ని రాసి ఫైలును భద్రపరిస్తే ఆ ఫైల్‌ను 'వర్డ్ డాక్యుమెంట్' అంటారు. వర్డ్ డాక్యుమెంట్‌లో మనం రాసిన వ్యాసం రహస్య పద్ధతిలో భద్రపరచి వుంటుంది. దీనిని ఏ పద్ధతిలో మైక్రోసాఫ్ట్‌వారు భద్రపరిచారో మైక్రోసాఫ్ట్ వారికి తప్ప మరెవరికీ తెలియదు. ఈ పద్ధతిని వారు ఎవరికీ చెప్పరు. ఈ సాఫ్ట్‌వేర్లలో తప్ప మరే సాఫ్ట్‌వేర్‌లోనూ ఈ వ్యాసాన్ని చదవలేరు. కనుక మన సమాచారం మొత్తం అమెరికాలోని ఒక కంపెనీ గుప్పెట్లో వుంటుందన్నమాట. మైక్రోసాఫ్ట్‌వారు డాక్యుమెంట్లను దాచే విధానాన్ని అవసరం లేకపోయినా తరచూ మార్చేస్తుంటారు. ఇప్పటికి 'మైక్రోసాఫ్ట్ ఆఫీస్ -40, 95, 98, 2000, ఎక్స్‌పీ, 2003, 2007' వరకు విడుదలయ్యాయి. వీటన్నిటిలోనూ వర్డ్ డాక్యుమెంట్లు దాచే విధానం మారిపోతూ వచ్చింది. దీనివల్ల ఒక వెర్షన్లో వున్న వ్యాసం మరో వెర్షన్‌లో చదవడం కష్టమవుతుంది. ఈ విధంగా మైక్రోసాఫ్ట్ వారు కొత్త వెర్షన్ విడుదల చేసిన ప్రతిసారీ పెద్దమొత్తంలో డబ్బులు వెచ్చించి కొనాల్సి వుంటుంది. అంతేకాకుండా ఈ వర్డ్ డాక్యుమెంట్ల ద్వారా వైరస్ కూడా సులువుగా వ్యాప్తి చెందుతుంది. అందువల్లనే చాలావరకు మైక్రోసాఫ్ట్ సాఫ్ట్‌వేర్లపై ఆధారపడకుండా ఫ్రీ సాఫ్ట్‌వేర్లను వాడుతున్నారు. ఇక్కడ ఫ్రీ అంటే 'ఉచిత' అని కాకుండా 'స్వేచ్ఛ' అని అర్థం వస్తుంది. ఈ ఫ్రీ సాఫ్ట్‌వేర్లను మైక్రోసాఫ్ట్ వారిలా కాకుండా మన అవసరాలకు అనుగుణంగా మార్చుకోవచ్చు. ఎవరికైనా ఉచితంగా ఇవ్వవచ్చు. మైక్రోసాఫ్ట్ ఆఫీసును పోలివుండే ఈ సాఫ్ట్‌వేర్‌లో నేరుగా పిడిఎఫ్ చేసుకునే అవకాశం వుంది. ఆప్షన్స్ బార్‌లోని 'ఎక్స్‌పోర్ట్ పిడిఎఫ్' అనే బటన్‌పై క్లిక్ చేసి నేరుగా పిడిఎఫ్ చేసుకోవచ్చు. డ్రా అనే వెక్టార్ గ్రాఫిక్స్ సాఫ్ట్‌వేర్ లాంటివి అదనపు ఆకర్షణలు.

దీనిని http://download.openoffice.org/index.html నుండి డౌన్లోడ్ చేసుకొని, ఇన్‌స్టాల్ చేయాలి. ప్రోగ్రామ్స్ ఫోల్డర్‌లో 'ఓపెన్ ఆఫీస్.ఆర్గ్' పేరుతో ఓ ఫోల్డర్ క్రియేట్ అవుతుంది. అందులో ఈ సూట్‌లో వుండే ఆరు సాఫ్ట్‌వేర్ల జాబితా కనబడుతుంది. అందులోనుండి మనకు అవసరమైన సాఫ్ట్‌వేర్‌ను డైరెక్ట్‌గా ఓపెన్ చేసుకోవచ్చు. లేదా అదే లిస్ట్‌లో పైన కనిపించే 'ఓపెన్‌ఆఫీస్.ఆర్గ్'ను సెలెక్ట్ చేసుకొని ఓపెన్ చేసుకుంటే పక్కనున్న పటంలో కనిపించే విధంగా ఐకాన్లతో కూడిన పేజీ తెరుచుకొంటుంది. అందులో మనకు కావాల్సిన సాఫ్ట్‌వేర్‌ను ఆ ఐకాన్‌పై క్లిక్ చేయడం ద్వారా తెరవవచ్చు.

ఓపెన్ ఆఫీస్ ప్రత్యేకతలు

ఇది పూర్తిగా ఉచితం. ఈ సాఫ్ట్‌వేర్‌ను ఓపెన్ ఆఫీస్.ఆర్గ్ నుండి డౌన్లోడ్ చేసుకోవచ్చు. ఎలాంటి లైసెన్స్ ఫీజు చెల్లించనవసరంలేదు. వ్యక్తిగత, కార్యాలయ ఇతర అవసరాల కోసం స్వేచ్ఛగా వాడుకోవచ్చు. ◆ దీని కాపీలను ఇతరులకు పంపిణీ చేయవచ్చు. సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసుకోవచ్చు. ప్రపంచవ్యాప్త ఓపెన్‌సోర్స్ సముదాయానికి సలహాలు పంపవచ్చు. ◆ అనేక రకాలైన హార్డ్‌వేర్, ఆపరేటింగ్ సిస్టమ్స్ అయిన మైక్రోసాఫ్ట్ విండోస్, మ్యాక్, లైనెక్స్, సన్ సోలారిస్‌ల మీద పనిచేస్తుంది. ◆ అనేక భాషలను సపోర్ట్ చేస్తుంది. సుమారు 40 భాషల డిక్షనరీలు, స్పెల్లింగులు మొదలైన సౌకర్యాలున్నాయి.

ఓపెన్ ఆఫీస్ రైటర్ : ఇది ఎం.ఎస్.వర్డ్ మాదిరిగా పనిచేస్తుంది. చాలా తేలికగా దీనిని ఉపయోగించవచ్చు. దీని ఆఫీస్ సూట్‌లోని మరో సాఫ్ట్‌వేర్‌లోకి వెళ్ళాలన్నా ఆప్షన్‌బార్ మొదట్లో వుండే 'న్యూ' అనే బటన్‌పై క్లిక్‌చేసి వచ్చే లిస్ట్‌లో ఏదికావాలో ఎంపిక చేసుకోవచ్చు.

ఓపెన్ ఆఫీస్ క్లాక్ : విండోస్‌లో మైక్రోసాఫ్ట్ ఎక్సెల్ ఏ రకంగా ఉపయోగపడుతుందో అంతకంటే మెరుగైన సౌకర్యాలతో ఈ క్లాక్ ఉపయోగపడుతుంది. స్ప్రెడ్ షీట్‌లో సమాచారాన్ని తీసుకొని, గణిత సంబంధమైన లెక్కలు చేసుకోవచ్చు. అంతేకాకుండా ఇచ్చిన సమాచారాన్ని చార్టుల రూపంలోనూ, గ్రాఫుల రూపంలోనూ చిత్రీకరించవచ్చు. దీనిని ఉపయోగించి మనకు కావలసిన సమాచారాన్ని గణనం చేసి, విశ్లేషించవచ్చు. దీనిలోని గణాంక, బ్యాంకు, వ్యాపార సంబంధమైన ఆదేశాల (ఫంక్షన్స్)ను ఉపయోగించి సూత్రాలను కొనుక్కోవచ్చు. ఈ సూత్రాల సహాయంతో మనం అతి క్లిష్టమైన లెక్కింపుల సమస్యలను పరిష్కరించవచ్చు.

ఓపెన్ ఆఫీస్ ఇంప్రెస్ : ఎం.ఎస్.ఆఫీస్‌లో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ మాదిరి ఉపయోగపడుతుంది. ప్రజెంటేషన్ అనేది కొన్ని స్లైడ్స్ లేదా కొన్ని పేజీల సముదాయం. పేజీలలో లేదా స్లైడ్స్‌లో బొమ్మలు, టేబుల్స్, గ్రాఫ్స్ తదితర సమాచారాన్ని ఎదుటివారికి సులభంగా విశదీకరించేందుకు, మన భావాలను సులభంగా వ్యక్తీకరించేందుకు ఈ ప్రజెంటేషన్లు ఉపకరిస్తాయి. రకరకాల బ్యాక్‌గ్రౌండ్ డిజైన్లతో కూడిన ఈ పేజీలను స్లైడ్స్ రూపంలో ఒక్కసారి ఆర్గనైజ్ చేయడం తెలిస్తే ఇక ఏదైనా ప్రజెంటేషన్ రూపంలో చేయగలుగుతారు.

ఓపెన్ ఆఫీస్ బేస్ : ఎం.ఎస్.యాక్సెస్ మాదిరిగా ఉపయోగపడుతుంది. దీనిని యాక్సెస్ కంటే మెరుగైన, సురక్షితమైన డేటాబేస్‌ను తయారుచేసుకోవచ్చు.

ఓపెన్ ఆఫీస్ మ్యాథ్స్ : ఎం.ఎస్.ఆఫీస్‌లో ఈ రకమైన ఫీచర్‌లేదు. దీనిని ఉపయోగించి లెక్కలకు సంబంధించిన అనేక ఫార్ములాను తయారు చేసుకోవచ్చు. అందుకు కావాల్సిన అన్ని రకాల ఎలిమెంట్స్ ఇందులో వున్నాయి.

ఓపెన్ ఆఫీస్ డ్రా : ఈ రకమైన ఫీచర్ ఎం.ఎస్.ఆఫీస్‌లో లేదు. దీనిని ఉపయోగించి వెక్టార్ డ్రాయింగ్స్ క్రియేట్ చేయవచ్చు.

ఓపెన్ ఆఫీస్ ప్రస్తుతం అను ఫాంట్స్ వంటి తెలుగు ఫాంట్స్‌కు సపోర్టు చేయడంలేదు. అయితే యూనికోడ్ ఫాంట్స్‌ను నిక్షేపంలా వాడుకోవచ్చు. పైసా ఖర్చులేకుండా ఎప్పటికప్పుడు కొత్త వెర్షన్లను ఉచితంగా డౌన్లోడ్ చేసుకోవచ్చు. మరెందుకాలస్యం http://openoffice.orgను సందర్శించి డౌన్లోడ్ చేసుకోవడమే తరువాయి.

- కె.ఎక్స్.రాజు

జరిగినకథ:

[illegible] వేయదానికంటాడు. [illegible] పంతకాలు పెట్టించాలని [illegible] కూడా ట్రాయ్ వంగడు. తన కోపాన్నంతా [illegible] చూయిస్తాడు. అలా ఆయనను భయపెట్టాలన్న [illegible] పథకం విఫలమౌతుంది. ట్రాయ్‌తో ఒక్కమాట కూడా మాట్లాడనివ్వకుండానే కుయేన్‌ను బయటికినెట్టేస్తారు. అక్కడినుంచి తిరిగి జైలుకు పంపిస్తారు. అక్కడ ఆమెకు డాన్ అనే పిల్లవాడు పరిచయమౌతాడు. అప్పుడు....

వియత్నాం వీరుడు ఎన్‌గుయెన్ వాన్‌ట్రాయ్

(ఎనిమిదో భాగం)

కథనం: ఫాన్-థి-కుయేన్
అనువాదం: పాటూరి రామయ్య

తలూపుతూ అన్నాడు డాన్ :

'ఓ! నాకు బాగా తెలుసు. అప్పుడప్పుడు, ఆడుకోడానికి నాకు బొమ్మలూ అవీ తెచ్చి ఇచ్చేవాడు. మోటారు సైకిలు మీద మా ఇంటికి వచ్చేవాడు'.

'ట్రాయ్ మావయ్య ఇప్పుడెక్కడున్నదీ నీకు తెలుసా?' అన్నాను.

'జైల్లో ఉన్నాడు'

నేను పెద్దగా ఏడుస్తూ డాన్‌ను నా హృదయానికేసి కౌగిలించుకొన్నాను. తెలియని వారెవరైనా మమ్మల్ని చాలాకాలం నుంచి వేరుచేయబడ్డ తల్లీబిడ్డలనుకుంటారు. ట్రాయ్‌ని బాగా గుర్తుకు తెచ్చుకున్నాడు. నిజంగా ఆయనంటే డాన్‌కు ఎంత గౌరవం!

ఆయన మోటారు సైకిలు నిజంగా వార్డరు వాడుకుంటున్నాడని భావించాడు. తిరిగి ఆయనకు దీనిని పంపించాలని కోరుకునేవాడు.

కొంచెం సేపయిన తర్వాత ఇంకో ఖైదీ మా దగ్గరకు వచ్చాడు. అతడిలా చెప్పాడు :'ట్రాయ్ ఈ కుర్రవాణ్ణి చాలా యిదిగా ప్రేమించేవాడు. డాన్‌కు ఆరు మాసాలప్పుడు తల్లిని అరెస్టు చేశారు. కీలుబొమ్మల జెండాకు నమస్కరించడానికి వ్యతిరేకించిందని, కమ్యూనిస్టులను నిందించని నేరానికి ఆమెను కొట్టి చంపారు. ఇతని తండ్రి రెక్కలు ముక్కలు చేసుకొంటున్నప్పటికీ వీడిని పోషించడం చాలా కష్టమైపోయింది. అందువల్ల ఇతని మీద ట్రాయ్ అమితమైన సానుభూతి చూపేవాడు. ఆటబొమ్మలూ అవీ తెచ్చి యిచ్చి బాగా స్నానం చేయించి మరీ వెళ్ళేవాడు.'

డాన్ అవ్వ అప్పుడప్పుడూ ఇలా అంటూ ఉండేది.

'వీళ్ళ నాన్న కన్నా ట్రాయ్‌నే ఎక్కువగా తలచుకుంటూ ఉంటాడు.'

డాన్ కోసమైనా ట్రాయ్‌ని మళ్ళీ ఇక్కడికి మారిస్తే బావుండునని తలపోశాను. జైల్లో ఉన్నంతకాలం నన్నితడు అంతగా దిగులు పడనిచ్చేవాడుకాదు. రోజంతా వచ్చీరాని మాటలతో అనేక విధాలుగా ప్రశ్నించేవాడు. ఒక్కోసారి నా మీద కోపం వచ్చినప్పుడల్లా పెదవులు విరుచుకొని ఇలా అనేవాడు.

'నేను ట్రాయ్ మావయ్యతో చెప్తానుండు'

ప్రతిసారి పండుగాని, మాంసపు ముక్కగాని యిస్తూ ఇలా అంటూ ఉండేదాన్ని :

'ఇది ట్రాయ్ మావయ్య తన చిన్ని డాన్‌కు ఇచ్చిన. బహుమతి.'

ఆ మాట అనగానే వాడిలో సంతోషం పొంగిపొర్లుతూ ఉండేది. ఇలా అడిగేవాడు.

'మళ్ళీ ట్రాయ్ మావయ్య ఎప్పుడొస్తాడు?'

ఒక్కోసారి సాయంకాలాలప్పుడు ఇతని అవ్వను బిగించివున్న కొట్లోనుంచి ఇతడి గొంతు ఇలా వినబడుతూ ఉండేది.

'కుయేన్ అత్తయ్యా! నువ్వు ట్రాయ్ మావయ్యను వదిలిపెట్టేవా?'

ప్రతి ఒక్కరూ గొల్లున నవ్వేవారు.

ట్రాయ్ గురించి డాన్ మాట్లాడ్డం వింటూ నా సహచారిణిలు ఇలా అనేవాళ్ళు పరియాచకంగా :

'ట్రాయ్‌కి డాన్ లాంటి కొడుకు గలిగితే ఎంత ఇదిగా ప్రేమించేవాడో?'

కొడుకు కావాలని ట్రాయ్ ఎలా తపన పడేవాడో వెంటనే నామదిలో మెదిలింది.

'ఆడపిల్లలంటే నాకు చాలా ఇష్టం. కాని మనకు మొట్టమొదట మగపిల్లవాడు కలిగితే చాలా బావుండును' అన్నాడు ఇంతకు ముందొకసారి ట్రాయ్.

మళ్ళీ ట్రాయ్‌ని చూడ్డానికి నన్ను తీసుకెళ్ళేప్పుడు చిన్నిడాన్‌ను నాతో తీసుకెళ్ళడానికి తప్పకుండా ప్రయత్నించాలను కున్నాను. ఇది ఆయన మనస్సుకు చాలా సంతోషం కలిగిస్తుంది.

జైలు కొట్టు ఒకటి కొత్తగా నిర్మిస్తున్నారు. ఒకరోజు ఉదయం పనివాళ్ళకు తాగడానికి నీరు మరగబెట్టేందుకు నన్ను నియమించారు.

ఆకస్మికంగా ఒక పోలీసువాడు అరుస్తూ నాతో ఇలా అన్నాడు :

'ఫాన్ థి కుయేన్! నీకు సంబంధించిన వస్తువులన్నీ వెంటనే ఆఫీసుకు తెలియచేయాలి.'

నా పాలిట ఏమి విపత్తు జరగనున్నదోనన్న భీతి నన్ను వెంటాడింది. దూరప్రాంతానికి ప్రవాసం పంపబడే ఖైదీలందరికీ ఈ విధంగానే చెప్పారు. ఇనప ఊచలు కత్తిరించేవాళ్ళు, ఇటుకలు మోసేవాళ్ళు, ఇంకా అక్కడ పనిచేసే వాళ్ళంతా నా చుట్టూ చేరారు. నేను మనో నిబ్బరంతో సంతోషంగా ఉండేందుకు ఒక్కొక్కళ్ళు ఒక్కో విధంగా చెప్పారు.

ఎక్కడికి తీసుకెళ్ళినా పోరాట వీరుడైన ఉక్కులాంటి నాభర్తను గౌరవించుకుంటూ మననం చేసుకుంటూ ఉండమని వాళ్ళు నాకు సలహాలిచ్చారు.

నేను ఆయన్ను చూడకుండా పోయినందువల్ల ట్రాయ్ ఆందోళన చెందకుండా ఉండేందుకు ఇక్కడ దుస్థితి ఎలా సంభవించిందీ ఆయనకు తెలియచేయమని వాళ్ళను కోరాను. నా చుట్టూ చేరిన వారందరితోనూ ఇలా అన్నాను :

'ట్రాయ్ ఆరోగ్యం కుదుటపడ్డ వెంటనే మళ్ళీ ఇక్కడకు తీసుకొని వస్తారని నా నమ్మకం. అలా జరగని యెడల మీలో ఎవరైనా మరో జైల్లో ఆయన్ను కల్సుకున్నప్పుడు నేనిక్కడున్నంత కాలం నా ఆరోగ్యం బావుందనీ, నా దృఢత్వం చెక్కుచెదరలేదనీ మరీ చెప్పండి. నన్ను దూరంగా మరో జైలుకు తీసుకెళ్ళారని తెలియచేయండి. ఆ జైలు ఎక్కడో ఏమో ఇప్పటికీ నాకు తెలియదు. దీర్ఘకాలం నేనాయన్ను చూడలేకపోతే ఏమీ బాధపడవద్దని చెప్పండి. ఉత్తరోత్తరా నేను విడుదలయి ఒకవేళ ఆయనకు యావజ్జీవశిక్ష పడ్డప్పటికీ ఆయన్ను కాచుకునే ఉంటానని చెప్పండి.'

ఒకతనికి మెడమీద, భుజాలమీద విపరీతంగా మచ్చలుపడి వున్నాయి. అతనికోసం ఇంటినుండి భోజనం వచ్చేది. దాంట్లోనే కొంత నాకు తరుచుగా ఇస్తుండేవాడు. అతనిలా అన్నాడు.

'ఏం భయపడవద్దు. మేము ట్రాయ్‌ని కలుసుకున్నప్పుడు జైల్లో నీ నడవడి అంతా ఆయనకు తెలియచేస్తాం. అతడు చాలా సంతోషిస్తాడు. మనదేశం త్వరలోనే పునరైక్యం అయి తీరుతుంది. అప్పుడు మీరిద్దరూ మళ్ళీ కలుసుకుంటారు. ఏం ఫర్వాలేదు. ధైర్యంగా వుండు!'

ట్రాయ్‌పట్ల వాళ్ళ కెంతో గౌరవాభిమానం. నా మీద చాలా సానుభూతి చూపారు. వాళ్ళలో కొంతమంది ఉత్తర, దక్షిణాది వాళ్ళూ, మధ్య ప్రాంతం నుంచి వచ్చిన వాళ్ళూ ఉన్నారు. వాళ్ళు అనారోగ్యంతో, జబ్బులతో బాధపడుతూ వుండేవాళ్ళు. వారిలో చాలామంది జైలు జీవితానికి అలవాటుపడ్డ వాళ్ళు ఉన్నారు.

ఈ జైలుకు వచ్చేముందు జనరల్ పోలీసు డిపార్టుమెంటు కిందనున్న బి-42 లీ వాన్ డుయెట్, పూలోయ్ బియెన్‌హోవా, థుడుక్, గియాదిన్ శిక్షా కేంద్రాలలో శిక్షలు అనుభవించి వచ్చినవారే వీళ్ళంతా.

తిరిగి నేను స్త్రీల కొట్టుకు వచ్చాను. నేనూ, డాన్, అతని అవ్వ ఇంకా కొంతమంది ప్రవాసం పంపబడుతున్నామని ప్రతి ఒక్కరికి తెలిసింది. అక్కడకు వెళ్ళిన తర్వాత ఇబ్బంది పడకుండా వుండేందుకు బట్టలు, సబ్బు, తుండుగుడ్డలతో బాటు ఆహారానికి సంబంధించినవి గూడా నాకు బహూకరించారు. ప్రతి ఒక్కరూ నన్ను దుఃఖించవద్దని చెబుతున్నారే గాని అసలు వాళ్ళ కళ్ళనిండా నీళ్ళు సుడులు తిరుగుతున్నాయి.

ఉపాధ్యాయుని వలె పాటలూ, ఎంబ్రాయిడరీ నేర్పించిన 'వై' సోదరి సంగ్రహంగా ఒక విలువైన సలహా యిచ్చింది.

'నీవు ఏడ్చేకంటే మరింతగా పాడు. నీకు దుఃఖం వస్తే శత్రువు ముందు మాత్రం ఏడ్వవద్దు'

కొన్ని నిమిషాలయిన తర్వాత వాళ్ళు వెళ్ళారు. నేను పురుష ఖైదీలకు ఏమీ చెప్పానో అదే ఇక్కడి నా సహచారిణులకు చెప్పాను.

డాన్‌ను చేత్తో పట్టుకొని ఆవరణదాటి వెళ్ళిపోతున్నప్పుడు 'ఎక్స్' సోదరి వెనక్కి పిలిచింది. ఈ విషయం మళ్ళీ నాకు చెప్పాలని ఆమె భావించి ఉంటుంది. ఇలా చెప్పింది :

'భార్యలోగల బలహీనతలను ఆధారం చేసుకొని భర్త మీద ఒత్తిడి చేయించేందుకు నాటకమాడతారు. జ్ఞాపకముంచుకో ఎప్పుడైనా నిన్నలా ప్రయత్నించినప్పుడు చాలా జాగ్రత్తగా హుషారుగా ఉండాలి. ఆ దుర్మార్గుల మాయ ఉచ్చులో పడకూడదు. ట్రాయ్‌కి కలుగబోయే బాధలను తొలగించాలి.'

తలవని తలంపుగా అంతా తలకిందులైంది. జైలు ఆఫీసులో ఒక గంట వేచి ఉన్నాం. మాలో ముగ్గురిని విడుదల చేశారు. ఆ ముగ్గురు ఎవరో కాదు, మేమే. డాన్, అతని అవ్వ, నేనూ. ఇందుకు ఏ కారణమూ చెప్పలేదు. జైల్లో వున్న నాతోటి ఖైదీలకు ఈ విషయం తెలియచేసి వచ్చేందుకు నన్ను అనుమతించవలసిందిగా కోరాను, ఊహూ! వార్డర్లు నిరాకరించారు.

నేను మళ్ళీ దూది ప్యాకింగ్ చేసే వృత్తిలో చేరాను. ట్రాయ్‌కి తినుబండారాలకోసం, మా పెళ్ళి బాకీలు తీర్చేందుకు నేను మధ్యాహ్నం, రాత్రిళ్ళు కూడా అదనంగా పనిచేశాను. ఆయన్ను, 'ఛోళ్యాన్' అనే మరో ఆసుపత్రికి మార్చారు. ఆసుపత్రిలో ఖైదీలను చూడ్డానికి వీలులేకుండా చాలా కఠినమైన చట్టం అమలులో వుంది. అప్పటికి ఇంకా కోర్టులో విచారించని ఖైదీల విషయంలో ప్రత్యేకించి మరీ కఠినంగా వుంది చట్టం.

నేను ట్రాయ్‌ని చూచిన ప్రతిసారీ బిగ్గరగా ఏడ్వకుండా వుండలేకపోయాను. ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం వుంచిన ఖైదీలను చాలా అనాగరిక పద్ధతుల్లో చూసేవారు. అలా చూస్తున్నప్పుడు ఖైదీల బంధువులు చూచి ఏడవకుండా ఉండేవాళ్ళుకాదు. ఇక్కడ అలా జరగడం మామూలైపోయింది.

మెయిన్‌గేటు తలుపుకి ఒక సన్నటి రంధ్రం ఉంది. నేనా రంధ్రంలోంచి లోపలకు చూసేందుకు అక్కడే కూర్చొన్నాను. ఏభై గజాలకు మించిన దూరంలో ఇనపకమ్ముల వెనక ట్రాయ్ కూర్చొని ఉన్నాడు. శరీరం పైభాగం మాత్రమే చూడగలిగాను. ఆయనకు నా రెండు కళ్ళు మాత్రమే కనబడతాయి. నేను పెద్దగా పిలిచాను. ఎందుకంటే ఈ రెండు కళ్ళు నావి అని ఆయనకు తెలుసుకునేందుకు. ప్రియమైన భార్యలను ఈ రంధ్రం గుండా క్షణకాలం పాటైనా చూడవచ్చని ఆతృతతో చాలామంది అటూ ఇటూ తిరిగేవాళ్ళు లోపల. బయట నుంచి ఆ రంధ్రం గుండా లోపలున్న తన భర్తనో, లేక కుమారుణ్ణో చూడాలన్న ఆశతో ఒకర్నొకరు తోసుకునేవాళ్ళు.

నేను తొలి పర్యాయం వచ్చి ఇనుప గేటు దగ్గర వేచి వున్నప్పుడు ఒకామె. నాతో నా పక్కవాళ్ళతో ఇలా అన్నది :

'లోపల నిర్బంధించిన నా భర్తను ఫలానా అని తెలుసుకోడానికి ఈ విధంగా నాకు నాలుగు సంవత్సరాలు పట్టింది. చివరిసారి నేను వచ్చినప్పుడు నా కుమారుడు తండ్రిని గుర్తు పట్టగలిగాడు. దయచేసి కొంచెంసేపు నన్నలా చూడనివ్వండి. మళ్ళీ నేను వెంటనే 'హూ' వెళ్ళాలి'.

ఆమె కుమారునికి ఎనిమిదేళ్ళ ప్రాయం. కిందటి పర్యాయం తండ్రిని గుర్తుపట్టి లోపలికి దూసుకు పోయేందుకు ప్రయత్నించాడు. వెంటనే పట్టుబడ్డాడు కూడా. బాగా చితకబాది ఇవతల పారవేశారు.

ఈ గేటు పక్కనే ఇంకో చిన్న గేటు కూడా ఉంది. ఈ దారినే పోలీసులు వస్తూ పోతూ ఉంటారు. లోపలున్న ఖైదీ రోగులకు భోజనం తీసుకెళ్ళడం ఈ గేటు గుండానే.

ఒక దఫా చిన్న అవకాశం చిక్కింది. నా దగ్గర వున్న పొట్లాలన్నీ కాపలావాడి చేతికిచ్చి ట్రాయ్‌కివ్వమని చెప్పాను. ఒకటి రెండు నిమిషాలు ఆ గేటులోనే ఉండిపోయాను. నావైపు చూశాడు ట్రాయ్. నన్ను చూడ్డంతో ఆయనకు చాలా సంతోషం కలిగింది.

ట్రాయ్ ఇలా బిగ్గరగా అడిగాడు.

'నీవు విడుదలయ్యావా?'

'అవును విడుదలయ్యాను.'

'ఎలా ఉన్నావ్?'

'చాలా బావున్నాను.'

చేతుల్ని ఆదరవు చేసుకొని కిటికీ దగ్గరకొచ్చాడు. ఆ కిటికీకి ఇనపకమ్ములున్నాయి. వాటి సందుల్లో నుంచి చేయి బయటకు రానిచ్చి నావైపు ఊపాడు. నేను మళ్ళీ మాట్లాడబోయేముందు తలుపు మూసివేశారు.

(మిగతాభాగం వచ్చేవారం)

'అవతార్' ఐడియా ఇచ్చిందోచ్



అవతార్ సినిమా చూసే వుంటారు. అందులో కదిలే పర్వతాలను మర్చిపోయారా! ఇంకా మీ మదిలో మెదులుతూనే వున్నాయా! అయితే మరీ మంచిది. అసలు ఆ చిత్ర దర్శకుడికి అలాంటి పర్వతాలను సృష్టించాలన్న ఐడియా ఎలా వచ్చిందనుకొంటున్నారు? ఇదిగో ఈ బొమ్మలో కనిపిస్తున్న భారీ రాతిని చూశాకేనంట. మరీ అంతగా ఆశ్చర్యపోమాకండి. దాని పూర్తి వివరాలు మిమ్మల్ని మరింత ఆశ్చర్యచకితులను చేస్తాయి మరి. ఇదిగో ఈ ఫొటోలో కన్పిస్తున్న రాతి ఆకారం చైనాలోని హునాన్ జాతీయ పార్కులో వుంది. ఈ పార్కులో ఇలాంటి భారీ రాతి స్తంభాలు బోలెడన్ని దర్శనమిస్తాయి. పార్కుకు వెళ్లిన వారంతా ఇలా తల ఎత్తుకొని నోరు తెరచి వాటిని చూడాల్సిందే. అంత పొడవుంటాయవి. అనేక సంవత్సరాలపాటు మంచు మూలంగా క్రమక్షయానికి గురైన కారణంగా ఈ సన్నటి పొడవాటి భారీ రాతి ఆకారాలు ఏర్పడ్డాయంట. రాయి అయితేనేమి! అవతార్ లాంటి సూపర్‌డూపర్ హిట్ సినిమాకు ఉపయోగపడేలా మాంచి ఐడియాను ఇచ్చింది. అందుకే కాదేదీ స్ఫూర్తికి అనర్హం అనుకొందాం కాసేపు.

తెలుసా!



బడా బుక్కు

'ఏంటిది ఈ పుస్తకం ఇంత పెద్దగా వుంది?' అని ఆశ్చర్యపడుతున్నారా! మరి దాని సైజు అలాంటిది. ఇంతకీ ఈ పుస్తకరాజాన్ని సృష్టించింది ఎవరనుకుంటున్నారు? ఏ ముద్రాపకుడో, పుస్తక విక్రేతో కాదు. మైఖేల్ హాలే అనే శాస్త్రవేత్త. ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో వున్న బడా బుక్కుల్లో ఇదొకటి. ఇంతకీ దీని ఒడ్డూ పొడుగూ గురించి చెప్పుకోలేదు కదూ. పుస్తకం ఎత్తు వచ్చేసి 1.52 మీటర్లు. బరువు 60 కేజీలు. మొత్తం మీద 112 పేజీలున్నాయి. ఒక్కో పుస్తకం ముద్రించడానికి 1 గ్యాలన్ ఇంకుతో ఒక రోజంతా కుస్తీ పడాలంట. వావ్...అన్ని వివరాలూ భారీగానే వున్నాయే. ఇంతకీ ఈ పుస్తకంలో ఏముందేంటి? అనుకొంటున్నారా! భూటాన్ పర్యటన సందర్భంగా తీసిన హిమాలయ పరిసర జీవన విధానానికి సంబంధించిన ఫొటోలున్నాయి. అదండీ భారీ బుక్కు సంగతులు.



వేళ్ల బ్రిడ్జి

అబ్బో...మనం రకరకాల బ్రిడ్జీల గురించి చదివి వుంటాం. చూసి వుంటాం. కానీ ఇదిగో ఇక్కడున్న బ్రిడ్జిని మాత్రం చూసి వుండరు. దీని ప్రత్యేకత ఏంటంటే... చెట్ల వేళ్లతో తయారైంది. అదీ ఎవరో తయారుచేసింది కాదు. సహజసిద్ధంగా తయారైంది. సరిగా చూడండి. ఇది రెండంతస్తుల బ్రిడ్జి. ఎక్కడ వుందనుకొంటున్నారు! అత్యధిక వర్షపాతానికి పెట్టింది పేరైన చిరపుంజిలో. అదేనండీ ఏడాదికి ఐదు నెలలపాటు వానలు పడే చిరపుంజిలో. అక్కడ తరచూ వచ్చే తుఫానుల మూలంగా లోయల మీద ఇలాంటి సహజమైన బ్రిడ్జిలు ఏర్పడుతుంటాయి. రబ్బరు వృక్షాల వేళ్లు ఒకదానికొకటి చుట్టుకొని వారధులను అల్లేస్తుంటాయి. 40 అడుగుల వారధి తయారవడానికి 23 ఏళ్లు పడుతుంది. మరి బొమ్మలో చూపించినట్టు రెండంచెల వారధి తయారవడానికి ఎన్నేళ్లు పడుతుందో ఊహించుకోండి. ఒక్కసారిగా 90 మంది నడవగల...ఈ బ్రిడ్జి తయారవడానికి 500 ఏళ్లకు పైగా పట్టివుంటుందని స్థానికులు చెప్తుంటారు. అన్నట్టు దీన్ని చూడ్డానికి వచ్చే పర్యాటకుల సంఖ్య కూడా ఎక్కువేనండోయ్!

కొత్త పుస్తకాలు

అక్షరాలు పండించిన హాస్యం



"భమిడిపాటి కామేశ్వరరావు రచనలు"
(2వ సంపుటం)
పేజీలు: 343, వెల: 180/-)
ప్రతులకు :
విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు

జీవితంలోని వాక్కుమత్కృతులు సేకరించి, 1926 నుండే 'భారతి' సాహిత్య మాసపత్రికలో కథలు, వ్యాసాలు రాసి.. హాస్య ప్రధాన నాటక రచన చేసిన భమిడిపాటి కామేశ్వరరావు గొప్ప హాస్య రచయిత. 1950 ప్రాంతంలోనే జయపూర్ మహారాజా శ్రీ విక్రమదేవ వర్మ వీరిని "హాస్యబ్రహ్మ" బిరుదుతో సత్కారం చేసారు. నాటకరంగంలో అత్యంత ప్రజాదరణ పొందిన "కీర్తిశేషులు" నాటకం రాసింది వీరి కుమారుడైన "రాధాకృష్ణ".

ఆనాటి రోజుల్లో గ్రామసీమల్లో జరిగిన పలు అంశాల్ని- వ్యంగ్యంగా.. చక్కటి తేలిక పదరచనల్తో 7 అంకాలుగా చేసిన (వసుధా నాటక కర్త కదా) విభిన్న అంశాల వ్యాసరచన ఇది. ప్రతి ఒక్క శీర్షికా మనల్ని హాయిగా నవ్విస్తుంది. అవును/నిజం/మాటవరస/ లోకో భిన్న రుచి / మన తెలుగు/మేజువాణి/ తనలో/ మొదలైన శీర్షికల్లోని వ్యాసాలు ఆలోచింపజేస్తాయి. "మేష్టరీకూడా ఒక ఉద్యోగమేనా?" వ్యాసంలో పల్లెటూరి ముఖచిత్రాన్ని చక్కగా రచయిత ఆవిష్కరిస్తారు. "పల్లెటి దిక్కు వాళ్ళని బెదరకొట్టడానికీ, నాటకం వగైరా శాలల్లోకి టికెట్టు లేకుండా ప్రవేశించడానికీ, ఆలస్యంగా వచ్చినా సభలో అగ్రస్థానం అలంకరించడానికీ, బల్లకట్టు ఊరికే దాటడానికీ, పడవల్లో ఒకటో నెంబర్ గది ఖాళీ చేయించడానికీ బహు ఉపకరిస్తుంది (పేజీ.6). "మా పదోవర్గు ముత్తాతకి ఇంచక్కని విమానం ఉండేదిట. అందులో ఆయన షికారు వెళ్లే వాట్ట. నేను మా విమానాలు ఎరక్కేం! బోలెడు చూశాను మా పుస్తకాల్లో" (పేజీ. 39). రైలు రాక్షస వాహనం అని శ్రోత్రియుల నమ్మకం. అందుచేతనే అందులో వేసేబొగ్గుని రాక్షసి బొగ్గు అంటారని వారి వాదం. బస్సుకూడా యమవాహనం అయిన దున్న యొక్క కోవకి చెందిన ఇనుపజాతి అవడం వల్ల రైలుకీ బస్సుకీ ఎప్పుడూ సవతిపోరే.. (పేజీ 141)... భోజనానికి బారులు తీర్చి కూర్చున్న జనం ఎదుట పాకం వడ్డించడానికి వచ్చిన వాడు తను ఏయే సాధన సామాగ్రి ఏయే విధంగా వాడితే పాకం అవుతుందో ఆ శాస్త్రం తనకెంత వచ్చునో చెబుతూ కూర్చున్నా (పేజీ. 227)...ఇలా వ్యంగ్యంతో కూడిన వాస్తవాంశాల్ని మధ్య తరగతి జీవితాల మందహాసాలు.. 1850-1907 ప్రాంతంలో.. తెలుగు దేశంలోని సామాజిక స్థితిగతుల్ని ధనికుల పేదల... జీవన సరళి సామాన్యుల సాధక బాధలు.. ఎంతో వాస్తవిక ధోరణిలో హాస్యంతో రచయిత మనకు అందించారు... హాయిగా నవ్వడం కోసం చదువుకోవచ్చు ఈ గ్రంథాన్ని.

- తంగిరాల చక్రవర్తి

మగువ మానసిక సంఘర్షణకు ప్రతిబింబాలు



గోడలు
శ్రీపాద స్వాతి (కథాసంపుటి)
పేజీలు:171, వెల: 100/- రూ॥
ప్రతులకు : నవోదయ, ప్రజాశక్తి, విశాలాంధ్ర బుక్ హౌస్
శ్రీపాద స్వాతి, ఇ.నెం. 16-2-701/డి/2, క్రాంతి ట్రాన్స్‌పోర్టు ప్రక్కన, మలక్‌పేట, హైదరాబాద్ 36.

ప్రముఖ రచయిత్రి, అనువాదకురాలు, డా॥జె. భాగ్యలక్ష్మి, "ఇంద్రధనస్సు" అంటూ ఈ కథా సంపుటికి ముందు మాట రాసారు. పాఠకుడు, రచయిత, ఒకే తరంగాల తీరంలో రాగలిగితేనే ఆ రచన సార్థకమవుతుంది. మానవ సంబంధాలు, మానవత్వం, సరళత, సహజంగా ఉండటం... చెప్పదలచుకొన్న దాన్ని సూటిగా చెప్పడం- శ్రీపాదస్వాతిగారి కలంలోని ప్రత్యేకత. దాదాపు 26 కథలున్న ఈ కథా సంపుటిలోని అన్ని కథల్లో ఏకబిగువున చదివించే గుణం వుంది. తీరిన బెంగ, నేనుసైతం, మౌనంగానే.. రాజీ- మారు, అంచనా, ఎర్ర గోడలు - చీకటి గుహ- (విషయసూచికలో చీటికగుహ అన్నారు) మనసున్న మనిషి.. కథలు చాలా బాగున్నాయి. ఇతర భాషల్లోకి అనువాదం చేయాల్సిన మంచి కథలు. హృదయాన్ని ద్రవింపజేసే అద్భుతమైన కథ. ప్రతి తల్లి కూతుళ్లు.. తమ... తమ్ము..అంతరంగ తరంగాల్ని తడిమి చూసుకోవాల్సిన అద్భుతమైన కథ. తల్లిప్రేమ ఎంత గొప్పగా వుంటుందో తెలిపే "గోడలు" కథ. (సంపుటికి ఈ టైటిల్ పెట్టారు). "బేషజాలు వదలి అమ్మ అక్కున చేరాను. అమ్మ నిశ్శబ్దం కూడా మాటల్లాగే వినిపించింది. నాకు ఇరుకైన గోడలు ఎంతో విశాలంగా తోచాయి. అమ్మ నిశ్శబ్దాన్ని అనువదించుకుంటే" (పేజీ.22) ఇలాంటి బరువైన సన్నివేశాలలో కథ సాగుతుంది.

నేటి సమాజంలో చాలా మంది పురుషుల మనస్తత్వాన్ని బలమైన అభివ్యక్తితో "తీరిన బెంగ" కథలో చక్కగా రచయిత్రి రాసారు. పన్నెండేళ్ళ మాధవి (పనిమనిషి) పై ఇంటి ఓనర్ శృంగారం (ముద్దులు).. అద్దెకు దిగిన మాధవ్ దంపతులు.. ముసలి ఇంటి యజమాని స్త్రీ వాంఛ.. పూవులిస్తూ వెకిలి చేష్టలు.. బాల్యం నుండి.. నేటిదాకా పురుషుల మనస్తత్వాలతో పడిన ఇబ్బందులు.. మాధవ్ భార్యలో మెదలడం.. ఓరోజు తెలివిగా ఇంటి ఓనర్‌తో మాట్లాడటం కథకు చక్కటి ముగింపు.. "పులితోలు కప్పుకున్న నక్కల నించి ఎంతకాలం ఇలా పారిపోవడం? దీనికో పరిష్కారం లేదా? (పేజీ.171) వల్లీశ్వర్ అన్నట్లుగా "వాస్తవానికి దగ్గరగా యువతులు ఎదుర్కొనే సమస్యలకి, మానసిక సంఘర్షణలకి రచయిత్రి తన పాత్రల ద్వారా పరిష్కారం చూపించే ప్రయత్నం ఈ కథల్లో కనిపించింది. ఓ మంచి కథాసంపుటి చదివామన్న భావం పాఠకుల్లో కల్గించిన కవయిత్రి శ్రీపాద స్వాతి అభినందనీయురాలు.

-ప్రసన్న



బృహదీశ్వరాలయ గోపురం భలే భలే

ఏ ఆలయానికి వుండే ప్రత్యేకత దానికి వుంటుంది. కాని తంజావూరులోని బృహదీశ్వరాలయ గోపుర ప్రత్యేకత మాత్రం మరే దేవాలయానికి లేదనే చెప్పవచ్చు. గగనమధ్యంలో మార్తాండుడు తేజరిల్లిపోతున్నా ఆలయగోపురానికి బంగారుపూతలు పూస్తున్న ఈ దేవాలయ శిఖరం నీడ మాత్రం ఏ సమయంలోను నేలమీద పడదు. ఆ రోజు ఎంత ఎండకాస్తున్నా ఉదయం నుంచి సాయంకాలం వరకు ఏ వేళలోను బృహదీశ్వరాలయ గోపురం నీడ మాత్రం భూమి మీద పడదు. ఈ వింతకు కారణమేమిటో, ఆనాటి వాస్తుశిల్పులు ఈ విశేషాన్ని ఎలా సాధించగలిగారో ఈ నాటికీ కొరుకుడు పడక పెద్ద పెద్ద ఇంజినీర్లు సైతం తికమకపడిపోతున్నారు.







తమిళనాడులోని తంజావూరు నగరంలో పది శతాబ్దాల క్రితం చోళరాజులకాలంలో బృహదీశ్వరాలయాన్ని నిర్మించారు. చోళరాజులలో సుప్రసిద్ధుడయిన రాజరాజచోళుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఈ ఆలయాన్ని నిర్మింపచేశాడు. 1004వ సంవత్సరం నుంచి 1010వ సంవత్సరం వరకు ఆరు సంవత్సరాలపాటు అహోరాత్రులు శ్రమించి నిర్మించిన ఈ దేవళం అపూర్వ శిల్పకళాశోభకు ఆలయం. బృహదీశ్వరాలయ ప్రాంగణంలో చెక్కిన నేటికీ కనువిందు చేస్తున్న అనేక శిలాశాసనాల ద్వారా ఆనాటి రాజకీయ, ఆర్థిక సాంఘిక పరిస్థితులను తేటగా తెలుసుకొనవచ్చు. రాజరాజచోళుని వీరత్వం, ఆనాటి శిల్ప సంగీత, నృత్యాది కళావిశేషాలను శాసనాల వల్ల తెలుసుకోవచ్చు. ఈ మహారాజు కాలంలో బృహదీశ్వరాలయ సమీపంలో ప్రత్యేకంగా రెండు వీధులను కళాకారులకే కేటాయించారు. దాదాపు 400 మంది సంగీత నృత్యశాస్త్రాలలో నిష్ణాతులయిన కళాకారులు ఆ వీధులలో నివసించేవారట. ద్రావిడ వాస్తు పద్ధతిలో నిర్మించిన బృహదీశ్వరాలయం ఎన్నో విశిష్టతలకు ఆలవాలమైంది. ఈ దేవాలయ ప్రాంగణం 152 మీటర్లకు పైగా పొడుగుతో 76 మీటర్లకుపైగా వెడల్పుతో సువిశాలంగా వుంటుంది. ఆలయంలోని మూలవిరాట్ అయిన శివమూర్తి లింగాకారంలో 12 అడుగుల ఎత్తుతో శోభిల్లుతూ వుంటాడు. ఈ స్వామిని 'బృహదీశ్వరుడు' అని 'ఆడవల్లన్' అనీ వివిధ నామాలతో పిలుస్తూ వుంటారు.

గోపుర విశిష్టత

ఈ ఆలయగోపురాన్ని 216 అడుగుల ఎత్తుతో 14 అంతస్థులుగా అష్టభుజాకారంలో నిర్మించారు. ఈ గోపురం పైభాగాన 25 అడుగుల ఏకశిలా కలశం వుంది. ఈ శిలాకలశం బరువు 81 టన్నులకు పై మాటగానే వుంటుంది. బ్రహ్మాండమైన ఈ శిలాకలశాన్ని గోపురం మీద ప్రతిష్టించడం ఆనాడు పెద్దసమస్యే అయిందిట. ఆలయానికి 6 కిలోమీటర్ల దూరంలో వున్న సారాపల్లం అనే గ్రామం నుంచి ఆలయగోపురం ఎత్తువరకు ఏటవాలుగా ఇసుకతిన్నెలను ఏర్పరిచి ఆ మార్గం గుండా కలశాన్ని గోపురంమీదికి చేర్చారట. ఈ బృహత్కార్యం నిర్వహించటానికి కొన్ని వేలమంది పనివారు అవసరమయ్యారంటారు. ఏకశిలాకలశం రెండువైపులా రెండు అందమైన నంది విగ్రహాలు జీవకళ ఉట్టిపడుతూ దర్శనమిస్తూ వుంటాయి. శిఖరం నీడ ఏ సమయంలోను నేలమీద పడనివిధంగా నిర్మించటం జరిగింది. గోపురానికి దక్షిణ దిక్కున గణేషుడు, భోళాశంకరుడు వగైరా శిల్పమూర్తులుండగా ఉత్తరదిక్కున వీరభద్రుడు, అర్ధనారీశ్వరుడు వగైరా కన్పిస్తాయి. తూర్పున నటరాజు అఖండనృత్యంలో మునిగిపోయి వుండగా పశ్చిమభాగాన హరిహరుడు, చంద్రశేఖరుడు... వున్నారు. వెరసి అపూర్వమైన కళాశోభతో విలసిల్లే ఈ మూర్తులన్నిటితో బృహదీశ్వరాలయ గోపురం కళలకు కాణాచిగా వెలిగిపోతూ వుంటుంది. ఈ గోపురాన్ని దక్షిణమేరుగా అభివర్ణిస్తుంటారు కూడా.

వాసికెక్కిన నంది

ఆలయప్రాంగణంలో గర్భగుడికి ఎదురుగా వున్న మండపంలో ప్రతిష్ఠించిన నందివిగ్రహం భారతదేశంలో వున్న రెండో పెద్దనంది విగ్రహం. 12 అడుగుల ఎత్తుతో 19కి పైగా అడుగుల వెడల్పుతోవున్న ఈ బృహత్ నంది తన గంభీరమైన చూపులతో జీవకళ ఉట్టిపడుతూ భక్తులను విశేషంగా ఆకర్షిస్తూ వుంటుంది. ఈ మహానంది బరువు 25 టన్నులకు పై మాటగానే వుంటుంది.

ఇన్ని విశిష్టతలు కలిగిన బృహదీశ్వరాలయం తర్వాత కాలంలో వచ్చిన రాజులను కూడా ఆకర్షించింది. 13వ శతాబ్దంలో తంజావూరును పాలించిన కొనేరినాయక్ అనే పాండ్యరాజు ఈ ఆలయ ప్రాంగణంలోనే అమ్మవారి ఆలయాన్ని కట్టించాడు. 17వ శతాబ్దంలో మరో రాజు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి ఆలయాన్ని నిర్మించాడు. ఈ ఆలయాలన్నీ అపూర్వమైన శిల్పకళాశోభతో విరాజిల్లుతూ భక్తులను విపరీతంగా ఆకర్షిస్తున్నాయి!

తంజావూరు వెళ్ళినవారు అవశ్యం సందర్శించుకోదగ్గ తీర్థం బృహదీశుని దేవళం!

★

చిన్నకథ

స్పందన

మెటర్నిటీ ఆస్పత్రిలో గంగాధరం టెన్షన్ టెన్షన్‌గా తిరుగుతున్నాడు. అవతల భార్య నొప్పులతో విలవిలలాడుతోంది. తొలిసారిగా తనను 'నాన్నా' అని పిలిచిన మూడేళ్ల కూతురు స్పందనకు మాత్రం తండ్రి ఎందుకంత కంగారుగా ఉన్నాడో తెలియలా! రెండు గంటల తరువాత తీరిగ్గా నర్సు వచ్చి మగబిడ్డ పుట్టాడని చెప్పింది. అంతే గంగాధరం మొహం వెలిగిపోయింది. నర్సు డిమాండ్ చేసిన 300 రూపాయలు చేతిలో పెట్టి పసికందును తీసుకున్నాడు. ఇదే ఆస్పత్రిలో గతంలో ఆడపిల్ల పుట్టినపుడు 50 రూపాయలే ఇచ్చి ఉన్నాడు.

గంగాధరంది ప్రేమ వివాహం కావడంతో తల్లిదండ్రులకు వారి పెళ్లి ఇష్టం లేదు. పెళ్లయి ఐదేళ్లయినా బంధువులెవరూ వీరి ఇంటివైపు తొంగిచూడలేదు. భార్యంటే అతనికి అమితమైన ప్రేమ. ప్రస్తుతం తనకంటూ ఓ వంశోద్ధారకుణ్ణి ఇవ్వడంతో ఆ ప్రేమ మరింత ఎక్కువయ్యింది. కొడుకు పుట్టాడని తెలిసిన గంగాధరం తల్లిదండ్రులు, అత్తమామలు ఆస్పత్రికి వచ్చారు. మనవడ్ని ఎత్తుకుని ముద్దాడారు. తాను పుట్టినపుడు ఎందుకు రాలేదో తెలియని కూతురు అమ్మ పక్కన చేరి బిత్తర చూపులతో తదేకంగా తమ్ముణ్ణి చూసింది.

మూడేళ్లు గడిచాయి. కూతుర్ని ఇంటి పక్కనే ఉన్న గవర్నమెంట్ స్కూల్లో వేశాడు. కొడుకును మాత్రం కార్పొరేట్ స్కూల్లో చేర్చాడు. నర్సరీలో జాయిన్ అయిన కొడుకు ఇంగ్లీష్ అక్షరాలు వచ్చీరాకుండా ముద్దుముద్దుగా చెప్తుంటే మురిసిపోయేవాడు. కొడుకు ఆడింది ఆట. పాడింది పాట. కూతురు పుట్టినరోజుకు చుట్టుపక్కల వారికి చాక్లెట్లు పంచడంతో సరిపెట్టేవారు. అదే కొడుకు పుట్టినరోజుకు మాత్రం బంధువులందరినీ భోజనానికి పిలిచేవాడు.

తాను పుట్టినపుడు అవ్వాతాత ఎందుకు రాలేదో స్పందనకు చిన్నప్పుడంటే తెలియలేదు గానీ, పదేళ్లు వచ్చినప్పటినుంచి ఆలోచనలో పడేది. అంతేకాదు తండ్రి లేకుండా చూసి అమ్మను నిలదీసేది. 'వాడితో ప్రతిదీ నీకు వంతేనా' అని తల్లి కసురుకుంటూ కొట్టిపారేసేదే తప్ప ఆ చిన్నారిలో ఉదయిస్తున్న ప్రశ్నలకు సమాధానమిచ్చేది కాదు. ఇంకా మంకుపట్టు పడితే నాలుగు తన్ని నోరు మూయించేది. కొడుక్కి కార్పొరేట్ స్థాయిలో అన్ని సౌకర్యాలను ఇష్టంగా అమర్చిపెట్టేది. ప్రతిరోజూ భర్తకి, కొడుక్కి నాన్‌వెజ్ ఉండాల్సిందే. లేదంటే కొడుకు పళ్లెం విసిరికొడతాడు. గొడవ భరించలేక కనీసం ఆమ్లెట్ అయినా అందుబాటులో ఉంచేది. ఆడవాళ్లకు మాత్రం ఆదివారం మాత్రమే గుడ్డు గానీ, నాన్‌వెజ్ గానీ.

పదో తరగతి పరీక్ష ఫలితాలు వచ్చాయి. స్నేహితులంతా కలిసి సినిమాకు వెళుతున్నారని, తానూ వెళతానని తండ్రిని అడిగింది. అపుడే ఫ్రెండ్స్‌తో షికారుకు వెళ్లేంత పెద్దదానివయ్యావా? అంటూ కసురుకోవడంతో బొటబొటా కన్నీళ్లు కార్చి దుప్పట్లో తలదూర్చేసింది. తరువాత నెలరోజులకే తమ్ముడు ఏడో తరగతి పాసయ్యాడు. ఫ్రెండ్స్‌తో చిరంజీవి సినిమాకు వెళతానంటే డబ్బులిచ్చి మరీ పంపడం 'స్పందన' తట్టుకోలేకపోయింది. సమాజంలో ఆడపిల్ల, మగపిల్లవాడు వేర్వేరు అనే విషయం క్రమక్రమంగా ప్రతి విషయంలోనూ అర్థమవుతూ రావడంతో పెద్దయ్యేకొద్దీ గతంలో వలే మొండిపట్టు పట్టడం వదిలేసింది. అయితే కొడుకు మణికంఠ మొండితనం భరించలేని విధంగా తయారయ్యింది. అనుకున్నది ఏది జరగకపోయినా ఇంట్లో ఏదో ఒక వస్తువు విరగ్గొట్టేవాడు. దీని తీవ్రత ఎలా ఉందంటే పదో తరగతి పాసైన సందర్భంగా గంగాధరం స్వీట్‌బాక్సు తెచ్చాడు. ఆ సందర్భంగానే తన ఫ్రెండ్స్‌తో టూర్ వెళతానని కొడుకు అడగడంతో ప్రస్తుతం డబ్బుల్లేవని, ఈసారి పంపిస్తానని చెప్పాడు. అంతే తండ్రి చేతిలోని స్వీట్‌బాక్సును విసిరికొట్టి వెళ్లిపోయాడు. పదో తరగతి పాసైన కొడుకును బాధపెట్టడం ఇష్టం లేక అప్పు చేసిమరీ కొడుకును టూర్‌కు పంపించాడు గంగాధరం.

ఇంటర్‌లో మంచి మార్కులే వచ్చినా కుటుంబ ఆర్థిక పరిస్థితి నేపథ్యంలో డిగ్రీలో చేరింది స్పందన. తమ్ముడు కార్పొరేట్ కాలేజీలోనే ఇంటర్మీడియట్ చేరాడు. ఓ రోజు తండ్రి జేబులో ఎవరికీ తెలియకుండా తమ్ముడు డబ్బులు తీయడం చూసిన స్పందన అమ్మతో చెబుతానంది. అంతే కండ ఊడేలా కొరికేశాడు. ఏడుస్తూ జరిగిన విషయాన్ని తల్లికి వివరించినా 'నేనే తీసుకోమన్నాలే' అంటూ కొడుకునే వెనకేసుకొచ్చింది. 'అమ్మా తమ్ముడు రాత్రి 11 గంటలైనా రాలేదే?' అని అడిగితే 'మగాడు తిరక్క చెడ్డాడు... ఆడది తిరిగి చెడింది' అంటూ కసురుకునేది. ఓ రోజు బట్టలు ఉతుకుతున్న తల్లికి మణికంఠ ప్యాంటు జేబులో సిగరెట్ ప్యాకెట్ కనిపించి బిత్తరపోయింది. మెల్లిగా భర్తకు చెప్పింది. 'సరేలే వాడిని అడగొద్దు.. రాద్ధాంతం చేస్తాడు' అని అప్పటికి ఆ విషయాన్ని మరచిపోయారు. చిన్నప్పుడు కొడుకు చేసే ప్రతి విషయం ముచ్చటగా అనిపించినా, పెద్దయ్యేకొద్దీ కొడుకు ప్రవర్తనలో వచ్చిన మార్పు చూసి గంగాధరానికి భయం పట్టుకుంది. కొడుకును మందలిస్తే ఇంట్లో నానా బీభత్సం చేసేవాడు. దీంతో చివరకు చెప్పడమే మానేశారు. డిగ్రీ అయిపోయిన స్పందన లా కోర్సులో జాయినయ్యింది.

కాలచక్రం మరో రెండేళ్లు చుట్టుకొచ్చింది. ఎంసెట్ ర్యాంకు లక్షల్లో ఉండడంతో మేనేజిమెంట్ కోటా కింద మణికంఠను ఇంజనీరింగ్ చేర్చాల్సి వచ్చింది. క్రమక్రమంగా కొడుకు ప్రవర్తనకు ఆ ఇల్లు అలవాటు పడిపోయింది. అతనికి ఏది కావాలంటే అది తెచ్చివ్వడం తప్ప ఎదురు మాట్లాడే సాహసం ఆ ఇంట్లో ముగ్గురికీ లేదు. ఇంజనీరింగ్‌లో చేరిన మణికంఠ చేతికి 'పల్సర్' బండి వచ్చింది. క్లాస్‌మేట్ తపస్విని వెంట పడి ప్రేమించాలని నిత్యం వేధించేవాడు. తనకు ఇష్టం లేదని, తన తల్లిదండ్రులతో చెబుతానని చెప్పినా వినేవాడు కాదు. ఓ రోజు తపస్విని ప్రొఫెసర్‌కు ఫిర్యాదు చేసింది. చీవాట్లు పెట్టడమే గాక వారం రోజులు సస్పెండ్ చేశాడు. అంతే మగాడల్లా మృగాడయ్యాడు.

తపస్విని ఒంటరిగా ఉండడం చూసి బాటిల్లో తీసుకొచ్చిన పెట్రోల్ పోసి నిప్పుపెట్టాడు. పత్రికల్లో వార్త ప్రముఖంగా వచ్చింది. గంగాధరం ఏకైక కుమారుడు మణికంఠ మృగాడయ్యాడని పత్రికలన్నీ హోరెత్తించాయి.. మణికంఠను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఆశలన్నీ కొడుకుపైనే పెట్టుకుని జీవిస్తున్న గంగాధరం దంపతులు ఈ ఘటనతో కుమిలిపోయారు.

లా కోర్సు చదువుతున్న స్పందనలో ఎన్నో ప్రశ్నలు. తమ్ముడు మృగాడిలా మారడానికి కారకులెవరు? మహిళల పట్ల అడుగడుగునా వివక్ష చూపుతూ మగాడ్ని అందలమెక్కించిన సమాజానిదా? ఇద్దరు పిల్లల్ని రెండు కళ్లలా చూసుకోవాల్సిన తల్లిదండ్రులు తేడాగా చూసిన పెంపకానిదా? తనకు కావాల్సింది దక్కనపుడు నాశనం చేయడానికైనా వెనకాడని మనస్తత్వం ఉందని తెలిసీ కౌన్సిలింగ్ ఇచ్చేంత చొరవ చూపని ప్రతిఒక్కరిదీ తప్పే. మొక్కై వంగనిది [illegible] వంగుతాడనుకోవడం పొరబాటు. చిన్నప్పుడు చికెన్ లేదని ప్లేటు విసిరికొట్టినపుడే కూర్చోబెట్టి కారణం చెప్పి ఉంటే వినే మనస్తత్వం అలవడేది. సృష్టిలో ఆడ మగా ఇద్దరూ సమానమే. అందుకే 'పక్క'దారి పడుతున్న యువతరానికి 'కౌన్సిలింగ్' తప్పనిసరి. ఏది మంచి, ఏది చెడు అనే విషయాలను తెలుసుకుంటూ వేసే ప్రతి అడుగూ 'ముందడుగే'. ఆ అడుగే సమసమాజ నిర్మాణానికి నాంది. స్పందనకు తన బాధ్యత ఏంటో అవగతమయ్యింది. నేరం జరిగిన తరువాత తన అవసరం కంటే, నేరం జరగక ముందే నిరోధించాల్సిన కర్తవ్యం బోధపడింది. 'స్పందన' సెంటర్ ద్వారా యువతీ యువకులకు కౌన్సిలింగ్ ఇచ్చే లక్ష్యంగా అడుగులు వేసింది.

-అవనిగడ్డ వనజ



40 రోజులు! 150 కోట్లు!!

2010 క్లయిమేక్స్?

తెలుగు చిత్ర పరిశ్రమకు ఇది అత్యంత కీలకమైన ఘట్టం. ఈ ఏడాది ఇప్పటికి 11 నెలలు పూర్తి కావస్తున్నా, సరైన విజయాలు చెప్పకోదగినన్ని లేక నిస్పృహతో ఉన్న పరిశ్రమ ఊపిరి బిగపట్టి మరీ చూస్తున్న సమయం. 2010 ముగిసిపోవడానికి సరిగ్గా మరో 40 రోజులే ఉండడంతో, ఈ పతాక సన్నివేశంలోనైనా నిఖార్సయిన విజయాలు నమోదు చేసుకోవాలని తెలుగు సినీసీమ భావిస్తోంది. ఈ ఆఖరి వారాల్లోనైనా తగినన్ని విజయాలు సాధించి, గడచిన 11 నెలల చేదు జ్ఞాపకాలను మర్చిపోవాలని చూస్తోంది.

- రెంటాల జూనియర్

బహుశా ఇటీవల ఎన్నడూ లేని రీతిలో తెలుగు సినిమాకు గట్టి ఎదురు దెబ్బలు తగిలి, భారీగా నష్టాలు వచ్చిన సంవత్సరం ఈ 2010 కావచ్చు. ఈ ఏడాదిలో నిఖార్సయిన విజయాలు సాధించిన నేరు తెలుగు చిత్రాలు ఎన్నని లోతుగా లెక్క తీస్తే – 'పంచపాండవులంటే మంచపు కోళ్ళ వలె అంటూ మూడు వేళ్ళు చూపించబోయి, ఒక వేలు మడిచేసుకొనే' పరిస్థితి! ఈ ఏడాది ఆరంభం నుంచీ అరకొర విజయాల పరంపర కొనసాగుతూనే వచ్చింది. ఈ ఏడాది నవంబర్ మధ్యనాటికి విడుదలైన దాదాపు 100కు పైగా తెలుగు చిత్రాల్లో నిర్మాణ, పంపిణీ, ప్రదర్శక రంగాలు మూడింటికీ లాభాలు తెచ్చిపెట్టి, అసలు సిసలు విజయాలుగా నిలిచిన నేరు చిత్రాలు ఆరే ఆరు! అవి – 'అదుర్స్', 'ఏం మాయ చేశావే', 'బెట్టింగ్ బంగార్రాజు', 'సింహా', 'మర్యాద రామన్న', 'బృందావనం'. పక్క రాష్ట్రాల నుంచి తెలుగులోకి తర్జుమా అయిన చిత్రాల్లో 'రోబో' సూపర్ హిట్ కాగా, సూర్య నటించిన 'యముడు', ఆయన తమ్ముడు కార్తీ నటించిన 'యుగానికొక్కడు', 'ఆవారా' విజయాల బాట పట్టాయి.

నేరు తెలుగు చిత్రాల్లో మిగిలినవి పైన పేర్కొన్న మూడు విభాగాల్లో కనీసం ఏదో ఒక సెక్టార్‌కు ఎంతో కొంత నష్టం మిగిల్చినవే! చూసినవాళ్ళ ప్రశంసలు అందుకున్న 'ప్రస్థానం', 'వేదం' లాంటి ప్రయోగాలు సైతం వాణిజ్యపరంగా మాత్రం వెలితినే మిగిల్చాయి. అందుకే, 2010లో మిగిలిన ఈ కొద్ది వారాలు ఈ ఏటి తెలుగు పరిశ్రమకు చావో, రేవో తేల్చే సమయంగా మారాయి. ఈ నలభై రోజుల్లో సగటున ప్రతి మూడు రోజులకూ ఒక సినిమా చొప్పున డజనుకు పైగా తెలుగు సినిమాలు వస్తున్నాయి. ఈ చిత్రాల మీద చిత్రపరిశ్రమ దాదాపు రూ. 130 నుంచి రూ. 150 కోట్ల మేర మొత్తాన్ని పణంగా ఒడ్డుతోంది. సంవత్సరాంతంలో సాగుతున్న ఈ అతి పెద్ద పందెం ఈ ఏడాదిలోకెల్లా పెను జూదం.

రికార్డులెక్కువ... సక్సెస్‌లు తక్కువ

నిజానికి, గడచిన 2009 కూడా తెలుగు సినీ పరిశ్రమకు మరీ గొప్పగా ఏమీ లేదు. బాక్సాఫీస్ రికార్డుల సాధనలో చరిత్ర సృష్టించిన తెలుగు చిత్రసీమ, చిత్ర విజయాల సంఖ్యలో మాత్రం వెనుకబడి పోవడం గడచిన 2009లోని గమ్మత్తయిన విషయం. తెలుగు సినిమా వసూళ్ళ చరిత్రను తిరగరాసిన 'అరుంధతి', అంతటితో ఆగక ఏకంగా దక్షిణ భారత చలనచిత్ర వసూళ్ళలో కొత్త రికార్డును నెలకొల్పిన 'మగధీర' – ఈ రెండు చిత్రాలూ ఒకే ఏడాదిలో తెలుగు తెరపై ప్రభవించాయి. విశేష జనాదరణ పొందిన తెలుగు సినిమాకు వసూళ్ళ విషయంలో ఆకాశమే హద్దని కొద్ది నెలల తేడాలోనే ఈ రెండు చిత్రాలూ మళ్ళీ మళ్ళీ నిరూపించాయి.



నష్టాల్లో ఈ ఏటి కొత్త రికార్డు

కానీ, ఈ గడ్డు పరిస్థితికి కారణమైన అంశాల గురించి మన సినీ రంగ ప్రముఖులు ఆత్మపరిశీలన చేసుకున్నట్లు లేరు. అందుకే, 2010 ఆరంభం నుంచి ఇప్పటి వరకు మధ్య మధ్యలో మెరుపుల్లా విజయాలు వచ్చాయే తప్ప, ప్రధానంగా పరాజయాలే ఎదురయ్యాయి. పాత హిట్ 'మరో చరిత్ర'కు రీమేక్ దగ్గర నుంచి 'కేడి', 'వరుడు', 'కొమరం పులి', 'ఖలేజా' లాంటి పెద్ద చిత్రాల దాకా అధిక శాతం పరాజయాలే! ఇక, రజనీకాంత్ - శంకర్‌ల అనువాద చిత్రం 'రోబో' దెబ్బకు కుదేలయ్యాయి మన పెద్ద హీరోల 'కొమరం పులి', 'ఖలేజా'లు.

అయితే, రికార్డులెన్నో సృష్టించిన తెలుగు సినిమా తీరా మొత్తం సినిమాల విజయాల శాతంలో మాత్రం వెనుకబడిపోవడం గత ఏడాది విషాదం కలిగించే వాస్తవం. 'అరుంధతి', అది విడుదలైన కొద్ది నెలలకే వచ్చిన 'మగధీర' చిత్రాలు రెండూ కలిపి దాదాపు రూ. 150 కోట్ల దాకా టర్నోవర్ చేశాయి. కానీ, ఆ రెంటినీ మినహాయిస్తే, 2009లో విడుదలైన నూటికి పైగా నేరు, అనువాద తెలుగు చిత్రాల్లో తిరుగులేని విజయం సాధించినవి వేళ్ళ మీద లెక్కపెట్టగలిగినవే! సాధారణ ప్రమాణాలకు మించి రాబడి బాగా వచ్చినా, పరిమితి దాటిన నిర్మాణ వ్యయం కారణంగా, ఆఖరికి లాభం గూబలోకొచ్చిన సినిమాలు అనేకం. గత ఏడాది గట్టిగా జనం చూసిన సినిమాలు ఏమిటన్న క్షణంలో పేర్లు చెప్పగలిగినన్ని కొద్ది సినిమాలే తేలాయి.

సగటున ఏటా 100 సినిమాలను తెలుగు చిత్రసీమ నిర్మిస్తోంది. ఒక్కో చిత్రం మీద పెట్టుబడులు సగటున రూ. 4 కోట్లనుకున్నా, మొత్తం పెట్టుబడి రూ. 400 కోట్ల దాకా తేలుతుంది. అందులో 'అరుంధతి', 'మగధీర' చిత్రాల పెట్టుబడి దాదాపు రూ. 50 కోట్ల వరకు ఉంటుంది. తతిమ్మా రూ. 350 కోట్లు మిగిలిన 98 చిత్రాల తాలూకువే! దాదాపు రూ. 50 కోట్లు పెట్టుబడి పెట్టిన ఈ రెండే రెండు సినిమాలు కలిపి సుమారు రూ. 110 కోట్ల దాకా నికర వసూళ్ళు సాధించాయి (శాటిలైట్ హక్కులతో కలిపి - 'అరుంధతి' రూ. 45 కోట్లు, 'మగధీర' రూ. 65 కోట్లని సినీ వ్యాపార వర్గాల సునిశిత అంచనా). ఆ రెండు చిత్రాల మీద దాదాపు రూ. 150 కోట్ల మేర టర్నోవర్ జరిగినందుకు సంతోషించాల్సిందే! అయితే, అలా చంకలు గుద్దుకోవడంతో సరిపెట్టుకోకుండా, మిగిలిన 98 చిత్రాల పరిస్థితి, వాటి పెట్టుబడి రూ. 350 కోట్లలో ఏ మేర మొత్తాన్ని పరిశ్రమ వెనక్కి రాబట్టుకోగలిగిందో విశ్లేషించుకోవాల్సి ఉంది. ఏ రకంగా చూసినా తెలుగు చిత్రసీమలోని మిగతా 98 చిత్రాల మీద రూ. 150 కోట్లకు మించి రాలేదు. అంటే, గడచిన 2009లో తెలుగు చిత్ర పరిశ్రమలో దాదాపు 200 కోట్ల మేర డబ్బులు పోయుంటాయి. తిరిగొచ్చిన ఫిల్ములు డబ్బాల రూపంలో వెక్కిరిస్తూ ఉంటాయి.

ముందే వచ్చిన పెద్ద పండుగ!

ఈ పరిస్థితుల్లో ఇక ఇప్పుడు విడుదలవుతున్న చిత్రాల మీదే అందరి దృష్టీ నిలిచింది. ఇప్పటి వరకు అందుతున్న సమాచారాన్ని బట్టి ఈ డిసెంబర్ ఆఖరులోగా దాదాపు మరో డజనుకు పైగా చిత్రాలు విడుదల కానున్నాయి. వీటిలో అరడజనుకు పైగా భారీ చిత్రాలు ఉండడం విశేషం. సర్వసాధారణంగా సంక్రాంతి, వేసవి, దసరా సెలవులు తెలుగు సినిమాకు పెద్ద పండుగలు. ప్రేక్షకుల నుంచి పెద్ద మొత్తంలో వసూళ్ళు రాబట్టడానికి ఆ సీజన్లలో చిత్రాలను విడుదల చేయడానికి చిత్ర పరిశ్రమ ఉత్సాహపడుతుంటోంది. కాగా, ఇంగ్లీషు మీడియం చదువులతో వచ్చిన క్రిస్మస్ సెలవుల వెసులుబాటును కూడా సానుకూలంగా మార్చుకొనేందుకు ఇటీవల కొన్నేళ్ళుగా తెలుగు చిత్ర పరిశ్రమ ప్రయత్నిస్తోంది. హీరో నాగార్జున గడచిన కొన్నేళ్ళుగా ఏటా క్రిస్మస్‌కు ముందుగా డిసెంబర్ ద్వితీయార్ధంలో తన చిత్రాలను విడుదల చేస్తూ వస్తున్నారు. అప్పటి నుంచి సంక్రాంతి ముగిసే వరకు వచ్చే సెలవులను వసూళ్ళకు అనువుగా మలుచుకొనే వ్యాపార సూత్రాన్ని పాటిస్తూ వచ్చారు. ఇప్పుడు చాలా మంది ఆ సూత్రాన్ని పాటిస్తున్నారేమో అనిపిస్తుంది.

అయితే, ఈ సారి రిలీజుల సందడి



నవంబర్ ద్వితీయార్థం నుంచే మొదలైపోయింది. రామ్ చరణ్ తేజ్ నటిస్తున్న 'ఆరెంజ్', రామ్‌గోపాల్ వర్మ దర్శకత్వంలోని 'రక్తచరిత్ర-2', నాగార్జున హీరోగా 'రగడ', 'చంద్రముఖి'కి సీక్వెల్‌గా వెంకటేష్ ద్విపాత్రాభినయం చేస్తున్న 'నాగవల్లి', రవితేజ 'మిరపకాయ్', శ్రీకాంత్ ద్విపాత్రాభినయ చిత్రం 'రంగ... ది దొంగ', అల్లరి నరేష్ 'కత్తి కాంతారావు', రామానాయుడు నిర్మిస్తున్న 'ఆలస్యం అమృతం' లాంటి పేరున్న చిత్రాలన్నీ ఈ సీజన్‌లోనే విడుదలవుతున్నాయి. పెద్ద చిత్రాలతో పాటు చిన్న చిత్రాలు కూడా ఈ కొద్దివారాల్లోనే విడుదలకు త్వరపడుతున్నాయి. 'సొంత ఊరు' ఫేమ్ పి. సునీల్ కుమార్ రెడ్డి దర్శకత్వంలోని 'గంగపుత్రులు', ఇంకా 'ఎల్.బి.డబ్ల్యు', 'మంచివాడు' లాంటి చిన్న చిత్రాలు కూడా ఈ పరుగులో పాల్గొంటున్నాయి. వీటికి తోడు తమిళ (కమలహాసన్ నటిస్తున్న తమిళ 'మన్మథన్ అంబు'), ఇంగ్లీషు, హిందీ చిత్రాల తెలుగు అనువాద రూపాలు సరే సరి! దాంతో, సాధారణంగా సంక్రాంతికి కనిపించే సినిమా సందడి ఈసారి ముందే వచ్చేస్తోంది. వెరసి నవంబర్ చివర నుంచి డిసెంబర్ చివరి వారం లోపల వరుస రిలీజులతో తెలుగు చిత్రసీమలో ఉత్సాహం, ఉద్వేగం రెండూ నెలకొన్నాయి. ఇది కనివిని ఎరుగని పరిస్థితి.

నిజానికి, దీపావళి తరువాత పండుగలేమీ లేకపోవడంతో నవంబర్ మొదలు డిసెంబర్ మధ్య వరకు సాధారణంగా సినిమాల విడుదలకు సరైన సీజన్ కాదు. "వ్యవసాయాధార ప్రాంతం కాబట్టి, దానికి సంబంధించిన పనుల్లో గ్రామీణ జనం తీరిక లేకుండా ఉంటారు. కాబట్టి, సాధారణంగా సినిమాల విడుదలకిది సరైన సమయం కాదు" అని తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి కార్యదర్శి టి. ప్రసన్న కుమార్ కూడా అంగీకరించారు. అయితే, 'కొమరం పులి', 'మహేష్ ఖలేజా', 'బృందావనం' లాంటి మునుపటి పెద్ద సినిమాల రిలీజు ఎప్పటికప్పుడు వాయిదా పడుతూ, ముందు అనుకున్న దాని కన్నా మూడు, మూడున్నర నెలలు ఆలస్యమైంది. ఇక, వాటికి దూరం జరగాలని చిన్న చిత్రాలు తమను తాము వెనక్కి నెట్టుకుంటూ వచ్చాయి. దాంతో చాలా సినిమాలు తయారై, విడుదల కోసం చూస్తున్నాయి. "ఇప్పుడిక మరింత ఆలస్యం చేయలేక తప్పనిసరి పరిస్థితుల్లో చాలా చిత్రాలు విడుదలకు సిద్ధమయ్యాయి. దాంతో, సీజను కాని సీజనులో కూడా ఒక్కసారిగా ఇన్ని చిత్రాలు విడుదలవుతున్నాయి" అని ఆయన వివరించారు.

'డిసెంబర్ 31' ఎఫెక్ట్

మునుపెన్నడూ లేని రీతిలో ఈసారి డిసెంబర్‌లోనే ఒక్కసారిగా ఇన్ని చిత్రాలు విడుదల కావడం వెనుక మరో కారణం కూడా కనిపిస్తోంది. గడచిన ఏడాది కాలంగా రాష్ట్రంలో నెలకొన్న వేర్పాటువాద ధోరణుల సెగ కూడా దీనికి పరోక్షంగా కారణమైంది. రాష్ట్ర విభజన అంశంపై కేంద్రం ఏర్పాటు చేసిన శ్రీకృష్ణ కమిటీ ఈ డిసెంబర్ 31లోగా నివేదికను సమర్పించాల్సి ఉంది. ఆ గడువు దగ్గర పడుతున్న కొద్దీ సహజంగానే ఉద్విగ్నత నెలకొంటోంది. ఈ పరిస్థితుల్లో తీరా నివేదిక సమర్పణ తరువాత రాష్ట్రంలో మళ్ళీ ఘర్షణల వేడి పుడుతుందేమోనని చిత్రసీమలో ఆందోళన నెలకొంది.

గడచిన 2009 డిసెంబర్‌లో ప్రజల్లో చెలరేగిన ప్రత్యేక, సమైక్య రాష్ట్ర వివాదాలు, బంద్‌ల ప్రభావం సినీ పరిశ్రమకు భారీగా నష్టం కలిగించింది. కొన్ని చిత్రాల విడుదలలు వాయిదా పడడం, మరికొన్ని ఏవో కొన్ని ప్రాంతాల్లోనే విడుదల కావడం, రిలీజైన చోట కూడా బంద్‌ల దెబ్బకు ప్రారంభ వసూళ్ళు దెబ్బ తినడంతో మొదట నైజామ్ ఏరియాలోనూ, ఆపైన ఆంధ్రా, సీడెడ్ ప్రాంతాల్లోనూ కోట్ల కొద్దీ నష్టాన్ని చిత్ర పరిశ్రమ చవిచూడాల్సి వచ్చింది. రాష్ట్రంలో నెలకొన్న విపత్కర పరిస్థితులతో అప్పట్లో విడుదల కావాల్సిన భారీ చిత్రాల విడుదలను తెలుగు చిత్ర పరిశ్రమ వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. ప్రత్యక్షంగా, పరోక్షంగా కలిపి రాష్ట్రంలో దాదాపు 10 లక్షల మందికి పైగా జీవనాధారమైన చిత్రపరిశ్రమలోని ఈ పరిస్థితి పెద్ద చిక్కే తెచ్చింది. "సినిమా షూటింగుల షెడ్యూళ్ళను మార్చుకోవాల్సి రావడం, రిలీజుల వాయిదా లాంటి అంశాల వల్ల అప్పట్లో పరిశ్రమకు రోజూ దాదాపు రూ. 7 కోట్ల దాకా నష్టం వచ్చింది" అని చిత్ర నిర్మాత - ఆంధ్రప్రదేశ్ చలనచిత్ర వాణిజ్య మండలి గౌరవ కార్యదర్శి కె.సి. శేఖర్‌బాబు పేర్కొన్నారు.

గత ఏడాది అలా ఆ వేర్పాటువాదాల వేడిలో విలవిలలాడిన తెలుగు చిత్రసీమ ఈ సారి 'డిసెంబర్ 31' డెడ్‌లైన్‌కు వీలున్నంత ముందే సినిమాలు విడుదల చేసేసుకొని, అంతా ప్రశాంతంగా ఉన్నప్పుడే నాలుగు రాళ్ళు సంపాదించుకోవాలని శతవిధాల ప్రయత్నిస్తోంది. "మునుపటి అనుభవాలను దృష్టిలో పెట్టుకొనే ఈ తొందరంతా! ఈ సారి వీలైనంత వరకు తమ సినిమాల విడుదల ఘర్షణ వాతావరణంలో లేకుండా ఉండేలా హీరోలు, దర్శక - నిర్మాతలు జాగ్రత్త పడుతున్నారు" అని దర్శకుడు సాయి బాలాజీ వ్యాఖ్యానించారు.

జనం ఎన్ని సినిమాలు చూస్తారు?

కానీ, ఒక్కసారిగా ఇన్ని సినిమాలు రిలీజైతే- వాటికి తగినన్ని హాళ్ళు, తగినంత మంది ప్రేక్షకులు, పెట్టుబడిని వెనక్కు తెచ్చే సామర్థ్యం

ఉంటాయా అన్నది ప్రశ్న. ఏకకాలంలో అయిదారు సినిమాలను సైతం సూపర్‌హిట్‌లు చేసేటంత మంది నిబద్ధ ప్రేక్షక వర్గం ఒకప్పుడు తెలుగు సినిమాకు ఉండేది. ఆ సంగతిని రచయిత రాజశ్రీ, నిర్మాత తారాచంద్ బర్జాత్యాతో వివరించిన ఘట్టాన్ని గుర్తు చేస్తూ, 1990లలో ఒకే రోజున 'కర్తవ్యం', 'ఆడది', 'మనసు – మమత', 'ప్రేమపావురాలు' (హిందీ 'మై నే ప్యార్ కియా'కు అనువాదం) నాలుగు సినిమాలు విడుదలైతే, రెండు సూపర్ హిట్లు, ఒక హిట్టు, మరొకదానికి మంచి ప్రారంభ వసూళ్ళు వచ్చిన సంగతిని సినీరంగ ప్రముఖులు ప్రస్తావిస్తున్నారు. "అప్పట్లో సినిమా టికెట్ రేట్లు అందుబాటులో ఉండేవి. దాంతో, సామాన్యుడు వీలైనన్ని సినిమాలు చూసేవాడు. నచ్చిన సినిమా పదే పదే చూసేవాడు. ఫలితంగా పరిశ్రమ పచ్చగా ఉండేది. కానీ, ఇవాళ టికెట్ రేట్లను విపరీతంగా పెంచేసి, ప్రేక్షక దేవుళ్ళను మనకు మనమే దూరం చేసేసుకుంటున్నాం" అని ప్రసన్నకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు.

సినిమాకున్న క్రేజును బట్టి తొలి రెండు వారాల టికెట్ రేట్లను అనధికారికంగా అనూహ్యంగా పెంచేస్తూ, ఆరంభ వసూళ్ళతో సినిమాను గట్టెక్కించాలని చూస్తున్నారు. పెద్ద హీరోల చిత్రాలకు తొలి వారం పది రోజులు ఒక్కో టికెట్‌నూ రెండొందలకు పైగా విక్రయించడం ఇటీవల చాలా చోట్ల పెరిగింది. గుంటూరు జిల్లా సంగతే తీసుకుంటే, గతంలో కింది పట్నాల్లో ఇలాంటి వినాశకర ధోరణి ఉన్నా, పెద్ద పట్నాలైన గుంటూరు, తెనాలిలో మాత్రం అధికారుల నిఘాకు వెరసి, మామూలు రేట్లకే టికెట్లు అమ్మేవారు. కానీ, ఈ ఏడాది 'అదుర్స్' చిత్రం నుంచి తెనాలిలోనూ పరిస్థితి మారిపోయింది. ఇప్పుడు పెద్ద హీరోల సినిమాను తొలి రోజుల్లో చూడాలంటే, తెనాలి లాంటి ఊళ్ళోనే అయిదుగురు సభ్యుల కుటుంబానికి కనీసం వెయ్యి రూపాయలు టికెట్లకే అవుతోంది!

సామాన్యులకు ఈ ఖర్చు భరించ లేనిదవుతోంది. అథవా కష్టపడి ఒక సినిమాకు భరించినా, ఆ నెల వారీ వినోదపు బడ్జెట్ అంతా ఒక సినిమాకే ఖర్చయిపోవడంతో, మిగిలిన సినిమాలకు వెళ్ళడమూ లేదు. బాగున్న సినిమాను మళ్ళీ మళ్ళీ చూసే పరిస్థితీ ఉండడం లేదు. ఈ నేపథ్యంలోనే అతి తక్కువ ఖరీదుకు దొరికే పైరసీ సీడీల మీద అనివార్యంగా జనం ఆధారపడుతున్నారు. సినిమా చూడాలన్న కోరికను ఆ రకంగా తీర్చుకుంటున్నారు.

పెద్ద పెట్టుబడుల పెను జూదం

అలాగే, ప్రతి రెండు పెద్ద సినిమాలకూ మధ్య విడుదలలో కనీసం మూడు నుంచి నాలుగు వారాల అంతరం ఉండేలా చూసుకోవడం ప్రస్తుతపు పెరిగిన రేట్ల పరిస్థితుల్లో విధాయకం. కానీ, అలా జరగడం లేదు. దాంతో, ప్రేక్షకుల నుంచి వచ్చే ఆదాయాన్ని పంచుకోవాల్సి వస్తోంది. వసూళ్ళ తుది మొత్తం తగ్గిపోతోంది. మరి, రానున్న నాలుగైదు వారాల్లో తెలుగు సినిమా ఆడుతున్న పెను జూదం విచ్ఛిన్నకర ధోరణుల మధ్య ఎలా పరిణమించబోతోంది? "గత డిసెంబర్ నాటి పరిస్థితి తలెత్తదనే భావిస్తున్నాం. శ్రీకృష్ణ కమిటీ తన నివేదిక ఇచ్చినా, వివిధ ప్రత్యామ్నాయాలను సూచిస్తుంది. అదే సమయంలో నివేదిక బయటకు రావడానికి కూడా సమయం పడుతుంది. కాబట్టి, ఏడాది క్రితం లాగా ఈ డిసెంబర్‌లో ఆవేశకావేశాలు పెచ్చరిల్లే ప్రమాదం ఉండదని అనుకుంటున్నా. ఆ ధైర్యంతోనే రానున్న సంక్రాంతికి కూడా సినిమాలు రిలీజుకు సిద్ధమవుతున్నాయి" అని చలనచిత్ర నిర్మాణ, పంపిణీ, ప్రదర్శక రంగాల్లో అనుభవజ్ఞులైన కొమ్మినేని వెంకటేశ్వరరావు ఆశావహ భావాన్ని వ్యక్తం చేశారు.

ఏమైనా, ప్రజా ధనం, స్థలం, ప్రభుత్వ సబ్సిడీలతో ప్రైవేటు వ్యక్తులు లాభార్జన ధ్యేయంగా సాగించే వ్యాపారమైన చిత్ర పరిశ్రమ ఈ సారి కూడా పెను జూదానికే సిద్ధమైంది. మరి, విడుదలవుతున్న చిత్రాల సంఖ్య రీత్యా భారతీయ చిత్ర పరిశ్రమలో ప్రథమ స్థానంలోనూ, వ్యాపార రీత్యా బాలీవుడ్ తరువాత రెండో స్థానంలోనూ నిలుస్తున్న తెలుగు చిత్రసీమకు ఈ ఏడాది ఈ ఆఖరు నెల రోజులైనా కలిసొస్తాయా? అన్నది ఇప్పుడు అక్షరాలా 150 కోట్ల రూపాయల విలువైన ప్రశ్న. ★



కథ

కండ్లు తెరిసిన మల్లేష్‌కి జనం కనిపిస్తున్నరు. అందరూ ఏందో హడావుడి చేస్తున్నరు. అరుపులు, ఏడ్పులు వినిపిస్తున్నయి. డాక్టర్లు, నర్సులు ఏదో పని మీద వున్నట్లు తిరుగుతున్నరు. మల్లేష్ హాస్పిటల్ బెడ్డు మీద వున్నడు. ఒక్కో బెడ్డు మీద ఒకరిద్దరు కూడా వున్నరు. కొందరైతే కిందనే పడుకోబెట్టిండ్రు. తనోళ్ళకోసం చుట్టూ చూసిండు, కొంతదూరంలో మరోబెడ్డు మీద మామ, పక్కనే అత్త కూర్చొని వుంది. ఆమెకు చిన్న చిన్న కట్లు కట్టిండ్రు. పిల్ల కన్పిస్తలేదు. ఏందో అయినట్లయింది. లేవబోయిండు. కాలు కదలనిస్తలేదు. కుడికాలుకు పెద్ద బ్యాండేజ్. దాన్ని చూసుకున్న మల్లేష్‌కు పెద్దషాక్. ఒక్కసారిగా కరంట్ తీగను తాకిన శరీరం లాగయింది. నోట మాట వస్తలేదు. కొంచెం సేపయిన తర్వాత కొంచెం కొంచెం అర్థమైతుంది.

సమాధానం

పి. అబ్దుల్ వహీద్‌ఖాన్

డి.సి.యం వ్యాను వేగంగా దూసుకుపోతోంది. ఎంత రాత్రయిందో తెలుస్తలేదు. మధ్య రాత్రయింది. కండ్లు తెరుచుకుంటే నిద్ర రాదని, వ్యానుకంటే వేగంగా వచ్చే ఆలోచనలు ఇంకా ఎక్కువయితాయని మూసుకున్న కండ్లను మల్లేషు తెరుస్తలేడు. ఈ ఉగాదికి వాళ్ళయ్య చనిపోయి ఏడాదిన్నర అయింటది. గుడిసె తీసి ఇల్లు కట్టుకుందమని ఇంద్రమ్మ పథకం కింద శాంక్షన్ చేయించుకొన్నాడు. ఆ పైసలు పెరిగిన ధరలకు సరిపోక పేంత అప్పు చేసిండు. అప్పు అనుకున్న దానికంటే ఎక్కువయింది. వచ్చే వర్షాకాలం పంటకు పెట్టుబడి దొరకదని తెలిసి వున్న మూడెకరాల చెల్కను బామ్మర్దికి గుత్తకిచ్చిండు.

"పెట్టుబడిని మింగటం తప్ప, సాయానికి రాకున్నా కాపు దానం మానుకుంటే ఎట్లా?" అని పెళ్లాం గొడవ. ఆ గొణుగుడు పడలేక, అప్పు తీర్చలేక ఏమీ అర్థం కాక ఋణ విముక్తి కంటే జన్మ విముక్తే ఎక్కువనుకొని పురుగుల మందు తాగిండు. కాని వాని కుటుంబం అప్పునుండి విముక్తి కాలేదు. ఊరు పెద్దలు, కులపోళ్లు కలిసి కొంత పొలంను అప్పులోల్లకు రాయించిండ్రు. వడ్డీ కింద భార్యను దొర దగ్గర జీతముండాలని తీర్మానం చేసిండ్రు.

ఇంత జరిగాక మల్లేష్ కాని చదువులకు అప్పెవరు ఇస్తరు. స్కూల్ల మంచి పిల్లగాండ్లలో వాడొకడు. వాళ్ళయ్య మంచి తనమే వానికి కొంత సాయపడుతుంది. తొమ్మిదో తరగతి పరీక్షలు అయిపోయినయి. వచ్చే ఏడు పది సదవాలె. పుస్తకాలు ట్యూషన్లు, బట్టలు, ఖర్చుల కోసం మూడు నాలుగు నెలలు కూలి చేయనికె గుంపు మేస్త్రి దగ్గర పని కుదిరించుకొని పోతున్నడు. వలస కింద వాడు ఎక్కడికి తీస్కపోతడో తెల్వదు.

✿✿✿

డి.సి.యం మస్తు స్పీడుగా పోతుంది. ఎన్కంగ వస్తున్న లారీ హారన్ విని మల్లేష్ కండ్లు తెరిచిండు. లారీని వ్యాను కంటే ముందుకు తీసుకెళ్ళాలని డ్రైవరు ఆతృత. దాని హెడ్‌లైట్లకు వ్యాను లోపల ఒక్కసారిగా వెలుగు. ఆ వెలుగుల అందర్ని చూస్తున్నాడు. మంచి నిద్రలో వున్నరు. కొందరు కూర్చొని, మరికొందరు పండుకొని, ఇంకొందరు కాళ్ళకాడ ముడుచుకొని నిద్రపోతున్నరు. వ్యాను లోపల పైన మచ్చులాగ చెక్కలతో కట్టిండ్రు. దానిపైన కూడా కొందరున్నారు. సూస్తుంటే సంతలో కొన్న పశు వులను తీసుకపోయేటట్లే వుంది.

తండ్రి పోయినప్పటి నుండి అన్నింటికి అండగా వున్న మామ, అత్త కూర్చొనే నిద్రపోతున్నారు. వీళ్ళంతా నిద్రపోతున్నారో. పోతున్నట్లు నటిస్తున్నరో తెలువకుండ వుంది. అత్త మామల మధ్య స్థలంలో వాళ్ళ బిడ్డ బాగా నిద్రపోతుంది. సంవత్సరం వయసుంటది. దానికీ వలస ప్రయాణం బాగా అలవాటైనట్లుంది. లారీ వ్యానును దాటిపోయింది. మళ్లీ అంతా చీకటి. మల్లేష్ చూపులు రోడ్డుపై పడినయి. రోడ్డు నల్లగా, నున్నగా కుదుపుల్లేకుండా వుంది. ఎవరూ హద్దులు దాటొద్దని రోడ్డెంబడి మధ్యన తెల్లని గీతలు ఆ కాస్తంత వెన్నెలకే అవి మెరుస్తున్నాయి. చాలా పొడుగ్గా మబ్బుల్లోకి దూసుకపోతున్న పెద్ద నల్ల త్రాచు పాములా రోడ్డు కనిపిస్తుంది. వాని ఆలోచనలు వ్యాను లాగానే మలుపు తిరిగినయి. "ప్రపంచంలో ఇంత పెద్ద పాము వుంటుందా? వుంటే ఎక్కడ వుంటదీ? ఏం అంటరో? మనుషులను, బర్లను ఆవులను ఎద్దులను మింగితదేమో..!? దోసుకొని పోయేటోనిలాగా మనుషుల్నే మింగుతదనేమో...!? ఇసొంటి పాములు వుంటే జనం ఎట్లా బతుకుతరు.? చిన్న చిన్న పాములను కొట్టనికే అయిదారు మంది కలిసి పొడవు కట్టెలు తీసికొని ట్రిక్కులతో కొట్టాలే. మరి ఇంగ పెద్దపాము వుంటే ఎట్లా సంపగలుగుతాం...!? మొన్న ఇంటికాడ ఇటుక పెల్లల్లో దూరిన పామును కొట్టనింకె ఎంతో

"పెట్టుబడిని మింగటం తప్పు, సాయానికి రాకున్నా కాపు దానం మానుకుంటే ఎట్లా?" అని పెళ్లాం గొడవ. ఆ గొణుగుడు పడలేక, అప్పు తీర్చలేక ఏమీ అర్థం కాక ఋణ విముక్తి కంటే జన్మ విముక్తే ఎక్కువనుకొని పురుగుల మందు తాగిండు. కాని వాని కుటుంబం అప్పునుండి విముక్తి కాలేదు. ఊరు పెద్దలు, కులపోళ్లు కలిసి కొంత పొలంను అప్పులోళ్లకు రాయించిండ్రు. వడ్డీ కింద భార్యను దొర దగ్గర జీతముండాలని తీర్మానం చేసెండ్రు.

ఇంత జరిగాక మల్లేష్ కాని చదువులకు అప్పెవరు ఇస్తరు. స్కూల్ల మంచి పిల్లగాండ్లలో వాడొకడు. వాళ్ళయ్య మంచి తనమే వానికి కొంత సాయపడుతుంది. తొమ్మిదో తరగతి పరీక్షలు అయిపోయినయి. వచ్చే ఏడు పది సదవాలె. పుస్తకాలు ట్యూషన్లు, బట్టలు, ఖర్చుల కోసం మూడు నాలుగు నెలలు కూలి చేయనికె గుంపు మేస్త్రి దగ్గర పని కుదిరించుకొని పోతున్నడు. వలస కింద వాడు ఎక్కడికి తీస్కపోతడో తెల్వదు.

కష్టపడవలసి వచ్చింది. అసలు ఇంత పెద్ద పామును సంపాల్నా...? లేదా మొక్కాల్నా...!? మొక్కినా...! అది మాత్రం మనల్ని వదలదు. అందుట్ల దాన్ని సగం కొట్టొద్దు. ఖచ్చితంగా సంపి కాల్చాలే...తప్పించు కుందంటే ఇక పగపడ్తది. అప్పుడు ఎంత మందిని మింగుతదో..!? ఏం చేస్తదో..!?" మల్లేష్ ఆలోచనలు వందరెట్లు వేగాన్ని అందుకున్నాయి. ఏదో తెలియని భయం, ఆందోళన వాన్ని ఆవహించాయి. కండ్లు గట్టిగా మూసుకున్నడు. ఆలోచనలకు ఏక్‌దమ్ బ్రేకులు పడ్డయి.

చల్లగాలి లోపలికి దూసుకువస్తుంది. వ్యానుకు పైన చుట్టిన టాడ్‌పాల్‌కు అక్కడక్కడ బొక్కలున్నాయి. వెన్నెలతో పాటు చల్లగాలి. దూసుకొస్తుంది. మల్లేష్ అనుకున్న ట్రాలి రేకుకు కూడా అక్కడక్కడ బొక్కలున్నాయి. అండ్లకెళ్లి గట్టిగా ఊదినట్లు గాలి తగులుతుంది. కూర్చొని కూర్చొని కాళ్లు పట్టుకొని పోయినై. కాళ్లు సాపనికె పోయిండు, కాళ్ళకాడ ఎవరో పడుకున్నరు. కొంతలోకొంత సాపనికె చేయిని కిందికి ఆనించి లేవబోయిండు. చేయికి సల్లగా తడి. నీళ్లెక్కడి నుండి కారినయబ్బా...? నా సంచిలో లేవే..? మామగిట్ల తెచ్చుకున్నడో... ఏమో...? ఆయనా .. తెచ్చుకోలేదే.... సందేహంగా ఆలోచిస్తున్నడు. మామ బిడ్డ గిట్లేమైన మూత్రం చేసుకుందేమో...? అయినా దానికి తడి తగలలేదా...? ఎవరికీ తగల లేదా..? తగిలినా గప్పుగా పండుకున్నరా. నిద్రలో వున్న కోడిపెట్టలా ఊగుతున్న మామ మేల్కొని

'ఏందిరా...? తడైనట్లుంది..."

"అవునూ.. అదే చూస్తున్న.. ఏముంటది...?" బదులిచ్చిండు మల్లేష్.

"ఏముంటది! పొకెట్ల నీళ్లగదాని సాయంత్రం కొన్ని ఎక్కువనే తాగింది. ఎక్కడ పోయాలో...? ఎక్కడ పోయద్దో.... దానికేం తెలుసు" అంటూ ఎత్తుకొని తల్లిని నిద్రలేపి ఒళ్లో పడుకోబెట్టిండు...

తల్లి ప్రేమకు ఏదీ సాటిరాదు. పిల్లల చెడును ఎంతైనా భరిస్తుంది. మళ్లీ చిగురిస్తున్న ఆలోచనల నుండి అమ్మ గుర్తుకు వచ్చింది. వ్యాను ఎక్కేటపుడు ఆమె చెప్పిన మాటలూ గుర్తుకొచ్చినై .

"ఏదైనా ఇబ్బంది అయితే మామకు చెప్పు. అక్కడిక్కడ తిరుగకు, నీకసలే కొత్త, పైసలు ఎక్కువగా ఖర్చుచేయకు. ముందే మన బతుకులు చెడివున్నయి! అని అనంగనే కండ్లలో కన్నీళ్లు సుడులు తిరిగినై. వాటిని భూమ్మీద పడకుండా అమ్మ తన కొంగుతో తుడిచి బంగారంలా దాచుకుంది. ఆ కండ్లలో కన్నీళ్ళను చూసిన నేను కూడ అపుకోలేక ఏడ్చిన.

"అయ్య వుండుంటే ఈ కష్టాలు వచ్చేవా..?" అని దీర్ఘాలు తీసి మరీ ఏడ్పులు.. వ్యాను ఎక్కేప్పటి విషయాలు కండ్లముందు స్పష్టంగా కదులుతున్నాయి. మల్లేష్ కళ్ళలో అప్రయత్నంగానే మళ్లీ కన్నీళ్లు ఉబికినై. భుజం మీద తువాలు తీసి తుడుచుకుంటున్నాడు. దానిని గమనించిన మామ "ఏం... రా... నిద్ర పడ్డంలేదా..."

"లేదు"

"ఆలోచించకుండా కండ్లు మూసుకో అదే వస్తది.'

"మస్తు సార్లు.. చూసిన వస్తలేదు"

"ఇపుడు నిద్రపోకపోతే రేపు తడకలేసుకోనికె కష్టమైతది... గిట్ల పండుకో..." అని సర్దుకొని కొంచెం జాగిచ్చిండు.

వ్యాను పోతనే ఉంది. బయటికి చూస్తే బండ్లవి ఎన్నో రెడ్‌లైట్లు దూరమైతున్నాయి. రాత్రి గడిసి తెల్లారెటట్లుంది. తెల్లారితేగాని చేరమన్నడు మేస్త్రి. డ్రైవరు క్యాబిన్ల కెల్లి పాట సన్నగా వస్తుంది. డ్రైవరుకు ఆ పాటేతోడు. అది లేకుంటే ఎపుడో నిద్రపోయేటోడు. ఇపుడైనా నిద్రరాదా... అనికొని కండ్లు మూసుకున్నడు. నిద్రలేక కొద్దిసేపట్లోనే నిద్రపోయిండు.

✿✿✿

కండ్లు తెరిసిన మల్లేష్‌కి జనం కనిపిస్తున్నరు. అందరూ ఏందో హడావుడి చేస్తున్నరు. అరుపులు, ఏడ్పులు వినిపిస్తున్నయి. డాక్టర్లు, నర్సులు ఏదో పని మీద వున్నట్లు తిరుగుతున్నరు. మల్లేష్ హాస్పిటల్ బెడ్డు మీద వున్నడు. ఒక్కో బెడ్డు మీద ఒకరిద్దరు కూడా వున్నరు. కొందరైతే కిందనే పడుకోబెట్టిండ్రు. తనోళ్ళకోసం చుట్టూ చూసిండు, కొంతదూరంలో మరోబెడ్డు మీద మామ, పక్కనే అత్త కూర్చొని వుంది. ఆమెకు చిన్న చిన్న కట్లు కట్టిండ్రు. పిల్ల కన్పిస్తలేదు. ఏందో అయినట్లయింది. లేవబోయిండు. కాలు కదలనిస్తలేదు. కుడికాలుకు పెద్ద బ్యాండేజ్. దాన్ని చూసుకున్న మల్లేష్‌కు పెద్దషాక్. ఒక్కసారిగా కరంట్ తీగను తాకిన శరీరం లాగయింది. నోట మాట వస్తలేదు. కొంచెం సేపయిన తర్వాత కొంచెం కొంచెం అర్థమైతుంది.

"మామా... ' అని కేకేయబోయిండు. సదువుకున్న పిల్లగాని లాగున్నడని ఇద్దరు టీవీ వాళ్లు మైకును, వీడియోను పట్టుకొని వచ్చిండ్రు. వచ్చీరాగానే వాళ్ళకంటే ముందే వారి ప్రశ్న ఎదురుపడ్డది.

"ఎలా జరిగింది బాబు....? అపుడు నీవేం చేస్తున్నావు...?

ఎలా జరిగిందో నిద్రలో వున్న వానికి ఏం తెలుస్తది. మాట పెగుల్త లేదు..

మళ్లీ అదే ప్రశ్న సమాధానాన్ని ఆశిస్తున్నట్లుగా, కొన్ని క్షణాల మౌనం....

"మా బతుకులు ఎలాగూ మారలేదు. కూలోళ్లను, వలస పోయేటోళ్ళను.. కనీసం క్షేమంగా నైనా తీసుకొని పోరెందుకు...? దానికి సమాధానం చెప్పించగలరా....? "మల్లేష్ నోరు పెకిలింది. కాదు కాదు పేలింది. ప్రశ్నలో ఆవేదన, ఆందోళన కలిసి వున్నయి.

సమాధానమే ఎలా వుంటుంది.....? సమాధానాన్ని ఎవరు ఇస్తారో...? ★

మష్రూమ్స్ పలావు



కావలసిన వస్తువులు

బాసుమతి బియ్యం - ఒక కిలో
మష్రూమ్స్ (పుట్టగొడుగులు) - అరకిలో
ఉల్లిపాయలు - 100గ్రా, నెయ్యి - 125 గ్రా,
గరంమసాలా - 10 గ్రా, పచ్చిమిర్చి - 40 గ్రా
పసుపు - చిటికెడు, పుదీనా 4 కట్టలు
పెరుగు 1 కప్పు, ఉప్పు - తగినంత

తయారు చేసే విధానం

ముందుగా బియ్యాన్ని శుభ్రంగా కడిగి, నీళ్లలో నానబెట్టాలి. తరువాత పుట్టగొడుగులను (మష్రూమ్స్) శుభ్రంగా కడిగి ముక్కలుగా కోసుకోవాలి. ఉల్లిపాయల్ని, పచ్చిమిరపకాయల్ని సన్నగా పొడవుగా విడివిడిగా తరిగి పెట్టుకోవాలి. పుదీనాను సన్నగా తరగాలి. వెడల్పుగా, బరువుగా వున్న ఇత్తడి పాత్రలో నెయ్యి పోసి స్టౌమీద వేడి చేయాలి. ఇందులో ముందుగా ఉల్లిపాయ ముక్కల్ని వేసి ఎర్రగా వేయించాలి. అల్లం, వెల్లుల్లి మిశ్రమం, గరంమసాలా, కారంపొడి, పసుపు, పచ్చిమిరకాయ ముక్కలు, పుదీనా వేసి వేయించాలి. ఈ మిశ్రమంలో పుట్టగొడుగుల ముక్కలు వేసి, కొద్దిగా వేయించాలి. ఇందులో పెరుగు వేసి బాగా కలపాలి. పుట్టగొడుగు ముక్కలు కొద్దిగా ఉడికిన తరువాత అందులో రెండు లీటర్ల నీళ్లు పోసి ఎసరు పెట్టాలి. ఎసరు మరగడం ప్రారంభించాక అందులో నానబెట్టిన బియ్యాన్ని బాగా వడకట్టి కలపాలి. బియ్యం సగం ఉడికాక స్టౌను సిమ్‌లో పెట్టి, తగినంత ఉప్పు కలిపి, పాత్ర మీద మూతపెట్టాలి. బియ్యం పూర్తిగా ఉడికిన తరువాత పాత్రను స్టౌమీద నుంచి కిందకు దించుకోవాలి. అంతే ఘుమఘుమలాడే మష్రూమ్స్ పలావు రెడీ. దీనిని వేడివేడిగా ఏదైనా గ్రేవీ లేదా పెరుగుపచ్చడితో కలిపి తింటుంటే వుంటుందీ...మ్!

రొయ్యల పలావు

కావాల్సిన వస్తువులు

బాసుమతి బియ్యం - ఒక కిలో, పచ్చి రొయ్యలు - 600 గ్రా, టమోటాలు - 200 గ్రా, ఉల్లిపాయలు - 150 గ్రా, రిఫైన్డ్ ఆయిల్ - 100 గ్రా, పచ్చిమిర్చి - 40 గ్రా, యాలకులు - 10 గ్రా, కారంపొడి - 1 టీస్పూను, పసుపు - 1 టీస్పూను, కొత్తిమీర - 4 కట్టలు
పుదీన - 2 కట్టలు, పచ్చి కొబ్బరి - 2 చెక్కలు
నిమ్మకాయలు - 2, ఉప్పు - తగినంత

తయారు చేసే విధానం

ముందుగా పచ్చిరొయ్యల పొట్టు తీసేసి శుభ్రం చేసుకోవాలి. ఉల్లిపాయలు సన్నగా తరగాలి. పచ్చిమిరపకాయలను చిన్న ముక్కలుగా కోసుకోవాలి. టమోటాలను ముక్కలుగా కోసుకోవాలి. కొత్తిమీర, పుదీనాను విడివిడిగా సన్నగా తరగాలి. తరువాత బియ్యాన్ని శుభ్రంగా కడిగి, పది నిమిషాలపాటు నీళ్ళలో నానబెట్టాలి. తరువాత కొబ్బరి చెక్కలను తురిమి, దాని నుంచి ఎనిమిది గ్లాసుల కొబ్బరిపాలను సేకరించాలి. తరువాత యాలకులను పొడిగా దంచుకోవాలి. కొబ్బరి పాలను ఒక పాత్రలో పోసి, అందులో యాలకులపొడి, సగం బియ్యం, తగినంత పచ్చిమిరపకాయ ముక్కలు, పుదీనా ఆకులు, నానబెట్టిన బియ్యం, తగినంత ఉప్పు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని స్టౌమీద పెట్టి ఉడికించాలి. ఈలోపుగా ఒక బాణిలో నూనెపోసి



స్టౌమీద వేడి చేయాలి. ఇందులో ముందుగా రొయ్యలను వేసి వేయించాలి. అందులో మిగిలిన సగం పసుపు, కొద్దిగా ఉప్పు కలపాలి. రొయ్యలు వేగుతుండగా ఉల్లిపాయముక్కలు మిగిలిన పచ్చిమిరపకాయ ముక్కలు, కారంపొడి వేసి వేయించాలి. తరువాత ఇందులో టమోటా ముక్కలు వేసి మగ్గబెట్టాలి. ఇందులో కరివేపాకు, కొత్తిమీర, గరంమసాల వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని బియ్యం మూడొంతులు ఉడికిన తరువాత బియ్యం ఉడికిస్తున్న మిశ్రమంలో వేసి కలపాలి. తరువాత స్టౌ మంట తగ్గించి పది నిమిషాలపాటు పాత్రను ఉంచితే బియ్యం పూర్తిగా ఉడుకుతాయి. నీళ్ళ తడి ఆరిపోయి, అన్నం పొడిగా తయారైన తరువాత అందులో నిమ్మరసం పిండి, స్టౌమీద నుంచి కిందకు దించుకోవాలి. వావ్! రొయ్యల పలావు రెడీ. వేడివేడిగా ఏదైనా గ్రేవీ లేదా పెరుగు చట్నీతో తింటుంటే వుంటుంది!

మటన్ పలావు

కావలసిన వస్తువులు

బాసుమతి బియ్యం - 800 గ్రా, మాంసం - 500 గ్రా, పెరుగు - 500 గ్రా, నెయ్యి - 100 గ్రా, ఉల్లిపాయలు -100 గ్రా, గరం మసాలా - 20 గ్రా, కోడిగుడ్లు - 4, పుదీనా - 4 కట్టలు పచ్చిమిరపకాయలు - 10, పలావు ఆకులు - 8
అల్లం వెల్లుల్లి పేస్ట్ - 4 స్పూనులు
కారంపొడి - 1 టీస్పూను
పసుపు - 1 టీ స్పూను, ఉప్పు - తగినంత

తయారు చేసే విధానం

ముందుగా బియ్యాన్ని శుభ్రంగా కడిగి నీళ్లలో నానబెట్టాలి. తరువాత ఎముకలు లేని (బోన్‌లెస్) మాంసాన్ని శుభ్రంగా కడిగి ముక్కలుగా కోసుకోవాలి. ఉల్లిపాయలు, పచ్చిమిరపకాయలు విడివిడిగా సన్నగా ముక్కలుగా తరగాలి. పుదీనాను సన్నగా తరగాలి. మాంసం ముక్కలలో రెండు టీ స్పూన్ల అల్లంవెల్లుల్లి పేస్ట్, గరంమసాలా, పెరుగు, పుదీనా, పసుపు, కారం, తగినంత ఉప్పు వేసి బాగా కలియబెట్టాలి. తరువాత ఈ మిశ్రమాన్ని కుక్కర్‌లో వేసి, అందులో లీటరు నీళ్ళు కలపాలి. మూతపెట్టి మాంసాన్ని మెత్తగా ఉడికించి దించుకోవాలి. తరువాత కుక్కర్‌లోని నీళ్ళను ఒక పాత్రలో వార్చి పక్కన పెట్టుకోవాలి. వెడల్పాటి బరువైన పాత్రలో నెయ్యి పోసి స్టౌ మీద వేడి చేయాలి. ఇందులో సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు, పలావు ఆకులు వేసి వేడి చేయాలి. ఇందులో సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు, పలావు ఆకులు వేసి దోరగా వేయించాలి. తరువాత మిగిలిన రెండు టీ స్పూన్ల అల్లం-వెల్లుల్లి పేస్ట్, పచ్చిమిరపకాయ ముక్కలు వేసి వేయించాలి. తరువాత ఇందులో పక్కన నిల్వ వుంచుకున్న మాంసంలో ఉడికించిన నీళ్ల పోసి మూతపెట్టాలి. ఎసరు మరగడం మొదలవగానే నానబెట్టిన బియ్యాన్ని అందులో వేసి ఉడికించాలి. బియ్యం సగం ఉడికిన తరువాత ఉడికించి సిద్ధంగా వుంచుకున్న మాంసం మిశ్రమాన్ని కలపాలి. తగినంత ఉప్పు వేసి బాగా కలియబెట్టాలి. తరువాత పాత్ర మీద మూతపెట్టి బియ్యాన్ని పూర్తిగా ఉడికించాలి. ఇంతలో కోడిగుడ్లు ఉడికించి పెంకు తీసి ముక్కలుగా కోసుకోవాలి. బియ్యం మిశ్రమం పూర్తిగా ఉడికాక కోడిగుడ్ల ముక్కలను అందులో వేసి కలపాలి. తరువాత మిశ్రమాన్ని స్టౌమీద నుంచి కిందకు దించుకోవాలి. మటన్ పలావు రెడీ. దీనిని వేడివేడిగా ఏదైనా గ్రేవీతోగానీ, పెరుగుపచ్చడితోగానీ, సాంబారుతోగానీ లాగించాలి.



లైట్ తీస్కో

సంతకం



అదిగో ఫలానా పేరుగలాయన వివిధరకాల ఫౌంటెను పెన్నులు సేకరిస్తున్నాడనీ, ఇదిగో ఫలానా వూళ్లో రకరకాల గడియారాలు సేకరించేవారంతా కలిసి ఒక సంఘంగా ఏర్పడ్డారనీ.. ఇలా రకరకాల వస్తువులు సేకరించేవారిని గురించి వింటుంటాం. లిమ్కా బుక్కులోకో.. గిన్నిసు బుక్కులోకో ఎక్కారనీ చదువుతుంటాం. బయటివారికి మాత్రం ఈ రకమైన సేకరణకు సంబంధించిన అలవాట్లు ఏ ఇతర వ్యసనాలకూ తీసిపోనివిగానూ కొండొకచో ఎందుకూ పనికిరానివిగానున్నూ కనిపించొచ్చు. అసలెందుకొచ్చిన కంచిగరుడ సేవరా బాబూ అనికూడా అనిపించొచ్చు. కానీ సేకర్తలకు మాత్రం ప్రతి ఒక్క సేకరణ తలంపూ - ప్రపంచాన్ని జయించాలనుకున్నపుడు అలెగ్జాండరుకు కలిగిన ఉద్వేగంతో సరిసమానంగా వుంటుంది!

ప్రపంచంలోని అన్ని దేశాల కరెన్సీలు, నాణేలూ సేకరించాలనే దృఢసంకల్పం కలిగి.. ఆ ప్రయత్నంలో తలమునకలుగా వున్న వారొకరైతే, ఖాళీ సిగరెట్టు పెట్టెలు సేకరించే వారింకొకరు. అగ్గిపెట్టెలమీది లేబుళ్లు మాత్రమే సేకరించేవారు మరొకరు. అప్పడాల కర్రలు సేకరించేవారు లేరనే సాహసం చేయలేము. ఆ కార్యక్రమ నిర్వహణలో, సాధనలో ఒకోసారి కలిగే నష్టాలనూ, కష్టాలనూ వీరు పెద్దగా ఖాతరు చేసినట్లు కనపడదు! పైగా అల్లప్పుడెప్పుడో భరాగో గారన్నట్లు వీరిపాలిటికి అవన్నీ సుఖకష్టాలనిపిస్తాయి!

ఈ క్రమంలో తెలుగు పుస్తకాలు సేకరించే అనేకులలో నేనొకణ్ణి. పుస్తకాలూ, పత్రికలూ సేకరిస్తున్నవారి కూడా రకరకాల విభాగాలవారుంటారు. భాషతో నిమిత్తం లేకుండా మొదటి సంపుటి మొదటి సంచికలు సేకరించే వారొకరైతే, పుస్తకం విడుదలైన రోజునే సేకరించేవారు మరొకరకం. ప్రత్యేకమైన తారీకు రోజునే సేకరించే వారింకొక రకం. ఆయాపుస్తక రచయిత లేదా రచయిత్రి సంతకంతో సేకరించే వారు వీరికన్నా భిన్నం. సంకలించే వారింకొక ప్రత్యేక రకమంటాడు మా మిత్రుడు సారథి (ఎవరికీ తెలియకుండా పుస్తకాన్ని చంకలో పెట్టుకొని తీసుకుపోవటానికి సంకలించడమనేది ఓ ముద్దుపేరు.). పుస్తకాలు సేకరించి చదివి చదివించేవారిని అత్యంత ఉత్తములనీ, ఏ రకంగానయితేనేమి - పుస్తకాలు చదివేవారిని ఉత్తములనీ, స్వంతడబ్బుతో కొనుక్కున్నవి మాత్రమే చదివేవారిని మధ్యములనీ, మిగిలినవారిని మిగిలిన వారనీ అనొచ్చనేది మా ఇంకొక మిత్రుని అభిప్రాయం. ఒకసారి ఓ ప్రచురణకర్త తమకు ముందుగా డబ్బు పంపితే ఫలానా రచయిత సంతకంతోవున్న పుస్తకం పంపుతానని ప్రకటించాడు. వారు చెప్పిన మార్గదర్శకాలను అనుసరించి, ఆ ప్రకారం ఆ పుస్తకాన్ని కొన్నాను. మరోసారి పుస్తకాల ఎగ్జిబిషన్‌లో ఒకస్టాల్లో రచయిత కూర్చొని తన పుస్తకం కొన్న వారి పేరుతో శుభాకాంక్షలు రాసి సంతకం చేసి ఇచ్చాడు. ఇంకోసారి ఓ రచయిత ఫలానా చోటకు రానున్నాడని తెలిసి ఆయన రచించిన పుస్తకాన్నొకదాన్ని కొని పట్టుకెళ్లి ఆయన సంతకం చేయించుకొచ్చుకున్నాను. అలా అలా నా వ్యాపకం రచయితల సంతకాలున్న పుస్తకాలు సేకరించటం వైపుకు మరలింది. రకరకాల పద్ధతులద్వారా రచయితల సంతకాలున్న పుస్తకాలు కొనసాగాను. పాతపుస్తకాల షాపులలో తెగవెతికేవాణ్ణి. ఒకోసారి రచయిత తనకు కావలసిన వారికి సంతకం చేసిచ్చిన పుస్తకం దారితప్పిగానీ! మరోదారి లేకగానీ? పాత పుస్తకాలమ్మే షాపు దగ్గరకు చేరుకునేది. అలాంటివి కూడా నేను చాలా ప్రయాసపడి కొనేవాణ్ణి. ఫలానా రచయిత సంతకం చేసిన పుస్తకం గానీ, నా సేకరణలో లేదంటే... ఆ రచయిత సంతకంతో పుస్తకం దొరికితే వదలొద్దని తెలిసిన పాతపుస్తకాలమ్మే వారందరికీ చెప్పి అట్టిపెడతాను. అలాంటిదేమన్నా దొరికితే వారు ప్రత్యేకంగా నా కోసం ఆ పుస్తకాన్ని దాచి ఇస్తారు. వారి డబ్బు వారు తీసుకుంటారు. అది వేరే విషయం, నాకు కావలసినది నాకూ వారికి కావలసినది వారికీ దొరుకుతున్నాయి. తద్వారా ఇద్దరికీ సంతృప్తి కలుగుతోంది.

నాకు వతనుగా పుస్తకాలిచ్చే మనిషిది చిన్నషాపు, అతని బావమరిది కొత్తగా ఈ రంగంలోకొచ్చాడు. అతడికి కూడా నా హాబీ మొత్తం చెప్పేను. అతనుకూడా తనవంతు సహకారమందించసాగాడు. ఒక సంవత్సరంపాటు అతనికి ఈ వ్యాపారంలో నిలదొక్కుకోవటానికే సరిపోయింది. ఆ తరువాత అతను నాలాటివాళ్లకోసం రచయితల సంతకాలున్న పుస్తకాలు విరివిగా తేవటం మొదలెట్టేడు. ఎలా తిప్పలు పడేవాడో తెలియదుకానీ దాదాపుగా ఏ రచయిత పుస్తకం కావాలంటే ఆ రచయిత పుస్తకం ఆ రచయిత ఎవరికో ఒకరికి శుభాకాంక్షల్లో, వినయవిధేయతలతో రాసి సంతకం చేసిచ్చినది తెచ్చేవాడు. ఇదంతా ఎలా చేయగలుగుతున్నావయ్యా? అనడిగితే ఇతను చిన్నగా నవ్వి ఆ రచయిత తన సహరచయితకో ఇతర బంధువులకో మిత్రులకో శుభాకాంక్షల్లో, భయభక్తుల్లో రాసిచ్చిన పుస్తకాన్ని దాని స్వంతదారు నుండి ఎక్కువమొత్తంలో డబ్బు చెల్లించి కొన్నాననేవాడు. ఆపైన తన లాభం తాను వేసుకొని మనకమ్ముతున్నాననేవాడు. ఇందులో బ్రతుకు తెరువు కోసం చేసే వ్యాపార లక్షణమే గాని మరేం కనపడేదికాదు. పోనుపోనూ అతను తెచ్చే పుస్తకాలు మిక్కిలి విలువైనవీ, ఒకపట్టాన దొరకని అరుదైనవీ అయివుండేవి. అలాంటి వాటిని నా లాంటి వారు ఎంతడబ్బైనా ఇచ్చి కొనేవారు. విశ్వనాథ సత్యనారాయణగారు అడివి బాపిరాజుకీ, శ్రీశ్రీ చలంగారికీ, ఆరుద్ర అక్కినేని నాగేశ్వరరావుకీ, యర్రంశెట్టి శాయి చిత్రకారుడు చంద్రకీ, యండమూరి చిరంజీవికీ, నామిని మహ్మద్ ఖదీర్ బాబుకీ ఇచ్చిన పుస్తకాలు ఇతగాడు సంపాయించి పెద్దమొత్తంలో డబ్బు తీసుకొని నాకమ్మేడు. ఆ పుస్తకాలు నా దగ్గరున్నాయన్న భావన నాకు కలిగించిన గర్వమూ, ఆనందమూ ముందు డబ్బు ఏమంత ప్రధానమైంది కాదనిపించింది! అలా తన మానాన తాను వ్యాపారం చేసుకుంటున్న ఇతన్ని -ప్రజల్ని మోసగిస్తున్నాడన్న అభియోగం మీద పోలీసులు అరెస్టు చేశారన్న వార్త నాక్కాస్త ఆలస్యంగా తెలిసింది. అసలేం జరిగిందో తెలుసుకొనేటప్పటికీ నాకు కాళ్ళూ చేతులూ వణికిపోయాయి. నోరు తడారిపోవటంతో చాలా సేపటివరకూ మాట రాలేదు. ఇలాంటి మోసాలు కూడా వుంటాయన్న ఊహే నాకంతకు ముందు రాలేదు. అసలు జరిగిందిదీ. మొదట్లో ఆయా రచయితలను బ్రతిమిలాడి, కాళ్లావేళ్లాబడి, పొట్టతిప్పల కోసమని చెప్పి, ఒప్పించి నాలాటి ఖాతాదారుల పేరుతో శుభాకాంక్షలు, సంతకాలు చేయించుకు వచ్చేవాడట. నిజమో అబద్ధమో తెలియదుకానీ ఆ తరువాత కొంతమంది రచయితలకు డబ్బాశ చూపి సంతకాలు చేయించుకు వచ్చేవాడట. ఇంక ఈ వ్యాపారంలో సులువులు తెలిశాక.. డజన్లకొద్దీ పుస్తకాలలో శుభాకాంక్షలూ సంతకాలూ మాత్రం రచయితచేత రాయించి కొనుగోలుదార్ల పేర్లు మాత్రం చాలా జాగ్రత్తగా ఆ రచయిత చేతిరాతకు దగ్గరగా వుండేటట్టుగా తానే రాసేవాడట. ఇంకా తరువాత తరువాత బాగా ముదిరిపోయాడు, దురాశాపరుడయ్యాడు. ఆ రచయితల సంతకాలు కూడా తనే చేసేవాడట. ప్రసిద్ధులైన రచయితల పాతపుస్తకాలు దొరికితే వాటిమీద పాతకాలపు ఇంకుతో ఆనాటి ప్రముఖులకు ఆయా రచయితలు శుభాభినందనలతో ఆ పుస్తకాన్ని ఇచ్చినట్లుగా తానే రాసేవాడట. చాలా జాగ్రత్తగా ఆయా రచయితల సంతకాలు చేసి ఏవేవో కాకమ్మ కబుర్లు చెప్పి చాలా ధరకు ఆ పుస్తకాన్ని నాబోటి వారికి అమ్మేవాడట. ఔరా!

- కట్టుకోలు సుబ్బారెడ్డి

జత చేయండి

ఫ్రెండ్స్! ఇక్కడ కొన్ని వస్తువులున్నాయి. వాటిలో ఒకదాని పేరు చెప్పగానే మరొకటి గుర్తొస్తుంది. మరి జత చేసేయండి.



సమాధానం: 1-11, 2-8, 4-10, 5-12, 6-7.

ఏం చెప్తున్నాడు?

పిడుగులూ... ఇక్కడో పోలీస్ ఏదో చెప్తున్నాడు. అతను చూపించే బోర్డును శ్రద్ధగా పరిశీలిస్తే ఆ విషయమేంటో తెలుస్తుంది. మరి కనిపెట్టండి.



జవాబు: sorry house full.

చేసేద్దాం

పపెట్ కావాలా!

హాయ్ నేస్తాలూ... మీకు బొమ్మలు ఏవైనా చేయడమంటే చాలా ఇష్టం కదా. అందుకే ఈ వారం మీకోసం పపెట్ తీసుకొచ్చాం. చాలా సులభంగా చేసేయొచ్చు. తర్వాత వేలికి తగిలించుకొని ఆడుకోవచ్చు ఎంచక్కా. బొమ్మల్లో చూశారుగా. పపెట్ భలే తమాషాగా వుందికదూ. మరి ఎలా చేయాలో తెలుసుకుందామే.

ఏమేం కావాలంటే...

1. ఆకుపచ్చ, ఎరుపు, నీలం, బూడిదరంగు బట్ట.
2. నీలం, ఆకుపచ్చ దారాలు
3. కత్తెర
4. సూది
5. బొమ్మ కళ్లు
6. దూధి
7. చీపురు పుల్ల .

ఎలా చేయాలంటే...

ముందుగా చార్టు మీద చిన్న బొమ్మ వేసుకోండి. ఎలాగంటే ఒకటవ బొమ్మలోలాగా. ఇప్పుడు బొమ్మ ఆకారం చుట్టూ వున్న చార్టును కత్తిరించేయండి. ఇప్పుడు ఆకుపచ్చ బట్టమీద ఆ బొమ్మను వుంచి









కత్తిరించండి. చూడ్డానికి బొమ్మ ఆకారంలోనే వుందికదా. ఇలా మరోసారి ఆకుపచ్చ బట్టను కత్తిరించండి. ఇప్పుడు ఈ రెండు ఆకుపచ్చ ఆకారాలను ఒకదాని మీద ఒకటి వుంచి 2వ బొమ్మలో చూపించినట్టు సూది, దారం(ఆకుపచ్చదే)తో కుట్టేయండి. ఆగండాగండి. బొమ్మ కింది భాగం మాత్రం కుట్టకూడదు. ఎందుకంటే ఈ ఆకారాన్ని వేలికి తగిలించుకొని ఆడుకోవాలిగదా. ఇప్పుడు దూది తీసుకొని బొమ్మ తల, చేతులు, పొట్ట సగం వరకు నింపండి. ఇప్పుడు చిన్న చిన్న చీపురు పుల్లలు తీసుకొని చేతుల్లోకి దూర్చండి. తర్వాత చేతుల చివర కుట్టేయండి. ఈ ఏర్పాటంతా చేతులు వంగకుండా. ఇంక బూడిద రంగు బట్టను త్రికోణాకారంలో వుండేలా కత్తిరించండి. మెడ కింద వుంచి అదే రంగు దారంతో కుట్టేయండి. ఇప్పుడు ఈ బొమ్మకు సరిపడా చొక్కా తయారుచేసి తొడిగేయండి. ఇంక బొమ్మ కళ్లు తీసుకొచ్చి అతికించండి. చివరిగా ఎరుపు రంగు గుడ్డ ముక్కను కత్తిరించి నోటి స్థానంలో కుట్టేయండి. అంతే పపెట్ తయార్. ఇప్పుడు మీ చేతి వేలికి తగిలించుకొని ఆడుకోవచ్చు. ఇలా ఏ బొమ్మ ఆకారం కావాలంటే అలా పపెట్‌ను చేసి ఆడుకోవచ్చు. అవునూ! మీకు ఈ పపెట్ నచ్చిందా! అయితే మీరు సొంతగా ఆలోచించి మరో పపెట్ ఏదైనా చేసేయండే. ◘

పదాలేంటబ్బా...

చిన్నారులూ... ఇక్కడ కొన్ని ప్రాణులు, వస్తువులు, తినుబండారాలు వున్నాయికదా. వాటి ఇంగ్లీషు పేరును పక్కనే వున్న గళ్లలో నింపండి.



జవాబు: cow, hat, rat, ice, sun, tie, mat, art, six.



ఏమేం ప్రాణులున్నాయి?

నేస్తాలూ... చూశారుగా. ఇక్కడో విచిత్రమైన ప్రాణి వుంది. దాని పేరు ఏంటో మీరు చెప్పాలి. సరేగానీ దీని ప్రత్యేకత ఏంటనుకున్నారు? చిన్నారి నేస్తం కె.నవీన్ చంద్ర ఈ బొమ్మను పంపించాడు. ఏంటిది విచిత్రంగా వుందీ అనుకోకండి. కంప్యూటర్‌లో రెండు ప్రాణులను కలిపి ఇలా విచిత్రమైన జీవిని తయారుచేశాడన్నమాట. దానికో పేరు కూడా పెట్టాడు. ఏంటంటే... స్పైకీ. స్పైడర్‌లో సగం, మంకీలో సగం కలిపితే స్పైకీనే కదా. ఇంతకీ నవీన్ గురించి చెప్పలేదుకదా. తను హైదరాబాద్‌లోని జెవిఎన్ హైస్కూల్లో 8వ తరగతి చదువుతున్నాడు. మీక్కూడా కంప్యూటర్ వుంటే ఇలాంటి ప్రయోగాలు చేసేయండి మరీ....

నిధిలో ఏమేం వున్నాయి?

ఓసారి ఓ వ్యక్తికి నిధి వున్న పెట్టె దొరికింది. అది తెరిస్తే...కళ్లు చెదిరిపోయే సంపద కనిపించింది. ఇంతకీ అందులో ఏమేం వున్నాయో మీరు చెప్పాలి? అదెలా అంటారేమో! ఇక్కడే క్లూస్ కూడా వున్నాయర్రా. అదిగో ఆంగ్ల అక్షరాలు తికమకగా వున్నాయికదా. వాటిని ఒక వరుసలో పెడితే పెట్టెలో వున్న సంపద ఏంటో తెలుస్తుంది.



జవాబు: 1. rubies, 2. silver, 3. pearls, 4. diamonds, 5. gold, 6. money.



చూసి వేసేయండి...

మాటల కోట - 27

రూపకల్పన : వెంకట సుబ్బారావు కావూరి

1		■	2	■	3		■	4
	■	5	■	6	■	■	7	
8	9					■	■	
■		■	■		■	10	11	
12		■	13		14	■	15	
	■	16	■	17			■	
18			19	■		■	20	
	■	21				■	22	
23		■		■	■	24		■

అడ్డం :

1. ఒడ్డు (2)
2. అమ్మ భాష లిపిలో చివరి అక్షరం (1)
3. కనికరం (2)
7. పదునైన, చురుకైన (2)
8. అన్ని రకాల కూరగాయల తట్ట, పలు విషయాల సమూహం (6)
10. ఆమె కాదు. మహేష్‌బాబు చిత్రాల్లో ఒకటి (3)
12. ఏడు రోజుల సమయ పట్టిక (2)
13. చులకన, అలుసు (3)
15. తాగు, సాగు అవసరాలు తీరాలంటే దారితప్పిన ఇది కురిస్తేనే (2)
17. తాళి కట్టేవాడు ఎందుకో అడ్డం తిరిగాడు మరి? (3)
18. కార్చిచ్చు, మొదటి రెండక్షరాలు కోర్టులో వేసేది (4)
20. మేలయిన, నివశించేవాడు, రాసి కాదు ఇది కావాలంటారు (2)
21. వినాయకుడే తన తొండం మాదిరిగా వంకరటింకరయ్యాడు ఇక్కడ (4)
22. రాజుగారి భార్య అటు నుంచి వచ్చింది (2)
23. ముందొచ్చిన చెవుల కంటే వాడిగా ఉండే ఇవి దారి మార్చి ఒకటే అయింది (2)
24. శ్రీరంగం శ్రీనివాసరావుని ఇంత పొడుగెందుకు, పొట్టిగా పిలవండి చాలు (2)

నిలువు :

1. విశ్రాంతి వాడుకలో (3)
4. మా ఇంటి గోడల మీద ప్రకటనలు రాస్తే గాడిదలని ఇలా తిరగేసి రాసి మరీ చెబుతారు కొందరు (8)
5. పశువుల్ని కట్టేసే మేకు కింద నుంచి పైకొచ్చింది (2)
6. గంత ఉన్న కొత్తవాడు (5)
9. లక్ష సాగి, హాస్యంగా ఇలా మారింది (3)
11. నా... ఎవరన్నా అంటే మనం ఇలా రాయాలి (2)
12. ఇది చెల్లించలేని సూక్ష్మరుణ గ్రహీతలు వాయిదాల్లో బాధలు పడలేక, ఒకేసారి ఆత్మహత్యకు పాల్పడుతున్నారు(5)
14. ఈ దేశంలో ఏదయినా దేవుడేకదా! ఇక్కడ వాన దేవుడిని స్మరించండి (4)
16. భౌ, భౌ... అంటూ పైకొచ్చింది (3)
19. ఒడలు ఒడ్డుకు చేరాక కట్టేసేది దీనికే (3)
20. ఒకనాటి తెలుగు సినీ కథానాయికి. సరస్వతినీ, లక్ష్మినీ తన పేరులో ఇరికించుకుంది (3)

మాటలకోట - 26 జవాబు

1 వా	2 ర	సు	3 లు	■	4 తో	తా	5 పు	6 రి
7 గు	జా	■	8 మే	9 జో	డు	■	10 ల	హ
11 డు	కా	ము	■	గి	■	12 ఒ	కిం	త
■	ర్లు	■	13 అ	■	14 ఉ	■	త	■
15 ఓం	■	16 ఏ	మ	రు	పా	టు	■	17 భా
■	18 దీ	■	రం	■	యం	■	19 కు	■
20 అ	పా	యం	■	21 అ	■	22 ప	టా	23 రం
24 ల	వ	■	25 తి	ప్ప	26 లు	■	27 రు	ధి
28 క	ళి	ణా	ప్ర	■	29 తా	రు	మా	రు

గాడిద పాట



ఓసారి ఒక గాడిద పచ్చికబయలు మీదగా వెళుతోంది. పిల్లగాలిని ఆస్వాదిస్తోన్న గాడిదకు చక్కటి సంగీతం వినిపించింది.
ఊ...లల్లాల్లా...ఊ...లల్లాల్లా...
నేను కూడా అంత అందంగా పాడగలనా! అసలు ఆ సుమధుర సంగీతం ఎటువైపు నుంచి వస్తోందో కనిపెట్టాలి ముందు.
ఊ...లల్లాల్లా...
గడ్డిమీద వయ్యారంగా నిలబడిన మిడతలు ఆ పాట పాడాయి.
వావ్...మిడతల్లారా! మీరు ఎంత బాగా పాడుతున్నారు?! నేను కూడా మీలా పాడాలంటే ఎలా?
ఓ...తప్పకుండా! మేం ఇంత బాగా పాడడానికి మేం తినే మంచు కారణమనుకుంటా!
గాడిద వాటి దగ్గరకు వెళ్లి ఇలా అడిగింది....
అంతే అప్పటినుంచి ఆ గాడిద మంచు మాత్రమే తినసాగింది.
కొద్దివారాల తర్వాత పాపం గాడిద ఎముకల గూడులా తయారైంది. దాంతో అస్సలు పాడలేని స్థితికి వచ్చింది.
హా...ల..ల
చివరికి ...గాడిద నిలబడలేని స్థితికి వచ్చింది. కిందపడిపోయింది. ఇంక ఎప్పటికీ లేవనేలేదు.
నీతి: తెలివితక్కువ సలహాలు పాటిస్తే జరిగే నష్టం అంతా ఇంతా కాదు.







ఒబామా...నే!




శ్వేతసౌధపు నల్లకలువ ఇన్ని రూపాల్లో
ఎప్పుడు విరిసిందబ్బా...అనుకొంటున్నారా!
మొన్న మన దేశంలో ఆతిథ్యం
పుచ్చుకున్నప్పుడే. అమాయకంగా మనల్నీ
మన దేశాన్నీ పొగడ్తల్లో ముంచేసి...
గడుసుగా వేలకోట్ల రూపాయల
పెట్టుబడులు తరలించుకెళ్లినప్పుడే. అప్పుడే
మన నెటిజన్లకు ఈ అవిడియా వచ్చింది.
ఫొటోషాప్ సాయంతో మన నేతల
ఆకారాల్లో ఒబామాను పెట్టేశారు.
సోనియా, మాయా, మమతా, బాల్ థాకరే,
రాహుల్, లాలూ, మన్మోహన్, అబ్దుల్
కలాం, కరుణానిధి...గెటప్‌లో
ఒబామాను ఇమిడ్చేశారు.